@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
మంగళవారం 27 అక్టోబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
తెలుగు డిజిటల్ దినపత్రిక
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# మిత్రధర్మం పాటించాల్సిందే



- టీడీపీ ముఖ్య నేతలకు చంద్రబాబు కీలక ఆదేశాలు
- స్థానిక ఎన్నికలపై పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- 'చెప్పాం-చేస్తున్నాం' ప్రచారంతో ప్రజల్లోకి వెళ్లాలని నేతలకు ఆదేశం
- మిత్రధర్మాన్ని తప్పకుండా పాటించాలని, ఎలాంటి వెసులుబాటు లేదని స్పష్టీకరణ
- అర్హులైన నేతలకు నామినేటెడ్ పదవులు
- ప్రతి బూత్‌లోనూ 2024 కంటే ఎక్కువ ఓట్లు పడాలని లక్ష్య నిర్దేశం

**అమరావతి**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీ ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ప్రతిఒక్కరూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. 'చెప్పాం-చేస్తున్నాం' అనే నినాదంతో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో మిత్రధర్మాన్ని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం తర్వాత మనం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. 151 సీట్లతో గెలిచి అరాచకాలు సృష్టించిన గొడ్డలి పార్టీని ప్రజలు కేవలం 11 సీట్లకే పరిమితం చేసి తిరుగుబాటు చేశారు. ఇప్పుడు మనం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాం. ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నాం. ఈ మంచి పనులను ప్రజలకు వివరించాలి" అని అన్నారు. కూటమి పార్టీల మధ్య - మిగతా3లో



## రక్షణ రంగానికి భారీ బూస్ట్

- రూ.2.12లక్షల కోట్లతో డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు
- రక్షణ దళాల ఆధునికీకరణకు కేంద్రం ఆమోదం
- సైన్యం కోసం డ్రోన్లు, గన్ సిస్టమ్స్, హెలికాప్టర్ల కొనుగోలు
- సరిహద్దుల్లో నిఘా, వైమానిక దాడుల నిరోధక సామర్థ్యాలకు బలోపేతం
- నౌకాదళం కోసం క్షిపణి నిరోధక వ్యవస్థలు, ఆధునిక పరికరాలు
- వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాతావరణ రాడార్ల కొనుగోలు
- స్వదేశీ రక్షణ పరిశ్రమలకు ప్రాధాన్యం.. 82 శాతం కొనుగోళ్లు దేశీయంగానే

# అర్నబ్ తుపానుపై సర్కార్ హైఅలర్ట్



- అర్నబ్ తుపానుపై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత
- ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణ చేపట్టాలి
- బాపట్ల--విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 115--125 కి.మీ. వేగంతో గాలులు వీచే ప్రమాదం
- విద్యుత్, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక నిఘా
- వరద ముప్పు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి
- పంట నష్టం నివారణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు
- అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దు



## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- జ్ఞానేశ్ కుమార్ కోసం మోదీ సర్కార్ అన్ని రకాల ఎత్తుగడలు వేస్తోంది
- జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణగా మోదీ సర్కార్ ఎత్తుగడలు: ఖర్గే
- ఓటరు జాబితాలపై పారదర్శకత ఏదీ?
- సీఈసీ రాజీనామా సహా మూడు డిమాండ్లు
- ఎస్ఐఆర్ నిలిపివేయాలని కాంగ్రెస్ పట్టు
- నవంబర్ 1న ఢిల్లీలో భారీ సభకు పిలుపు
- ధరల పెరుగుదలపై మోదీ సర్కార్‌పై విమర్శలు
- ఉల్లిపాయలు, చక్కెర ధరల పెరుగుదలపై ఆగ్రహం

## దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యానికి పెద్దపీట

- బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ సంబంధాల బలోపేతానికి భారత్ కృషి
- ప్రపంచ సవాళ్ల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే మార్గం
- పార్లమెంటరీ వ్యవస్థలో ఆవిష్కరణలు, సంస్కరణలకు ప్రాధాన్యం
- ప్రజాస్వామ్య సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం అవసరం
- అంతర్జాతీయ సహకారంపై చర్చలకు బ్రిక్స్ ఫోరమ్ వేదిక
- సభ్య, భాగస్వామ్య దేశాల ప్రతినిధుల హాజరు

సభ్య దేశాల ప్రతినిధులతో ప్రధాని మోదీ భేటీ



## విశాఖ తూర్పు తీరాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దుతాం



- ఆనంద్ మహీంద్రా పోస్టుకు లోకేశ్ రిప్లై
- విశాఖను తూర్పు తీర శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- గంగవరం బీచ్ అందాలపై ఆనంద్ మహీంద్రా ప్రశంసలు
- మహీంద్రా పోస్టుకు మంత్రి నారా లోకేశ్ స్పందన
- ప్రకృతి సౌందర్యం, సాంకేతిక అభివృద్ధి కలయికే విజన్
- ఏఐ, డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా విశాఖ
- పర్యాటక రంగంలోనూ విశాఖకు అపార అవకాశాలు
- సహజ అందాలను కాపాడుతూ నగరాభివృద్ధికి ప్రణాళికలు

## క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ



- రాహుల్‌కు కోర్టులో ఊరట
- తీర్పును స్వాగతించిన కాంగ్రెస్
- గాంధేయ మార్గంలో బీజేపీపై పోరు
- ఫిర్యాదుదారుడి అర్హతపై అభ్యంతరం
- ఎనిమిదేళ్ల కేసుకు ముగింపు
- అమిత్ షాపై వ్యాఖ్యలతో వివాదం
- కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

# ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

- ఎన్టీఆర్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలి
- ప్రాణాంతక వ్యాధులపై పరిశోధనలు ముమ్మరం చేయాలి
- వైద్య విద్య పట్టాలకే పరిమితం కావొద్దు
- ఎన్టీఆర్ దూరదృష్టితో వైద్య విద్యకు బలమైన పునాది
- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ గ్రహీతలు రావాలి
- వైద్య వృత్తిలో మానవత్వం, కరుణ కీలకం
- 12 ఏళ్లలో వైద్య విద్య గణనీయంగా విస్తరించింది
- ఎంబీబీఎస్ సీట్లు 1.20 లక్షలకు పెరిగాయి
- 40 ఏళ్ల ప్రస్థానంపై స్మారక సంచిక విడుదల చేసింది



**అమరావతి**

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ 40 ఏళ్ల వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. వేడుకలు జరుపుకొంటున్న వర్సిటీ వైస్‌ఛాన్సలర్, విద్యార్థులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ 40 ఏళ్ల ప్రస్థానం పురస్కరించుకుని రూబీ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ వికసిత్ భారత్ దిశగా దూసుకెళ్తున్న సమయంలో అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. - మిగతా3లో

## సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నాం

- ఫారం-6ను సవరించలేదు'.. సుప్రీంకోర్టులో ఈసీ అఫిడవిట్
- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా తీసుకున్నారు
- ఫారం- 6 ను కూడా సవరించలేదని వివరణ..
- అభిప్రాయాలు, ఆలోచనలన్నీ తుది నిర్ణయాలు కావు!



# సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నాం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలు అన్నింటినీ ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగానే తీసుకున్నారని భారత ఎన్నికల సంఘం సుప్రీం కోర్టుకు తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఇదే సమయంలో సర్ ఉత్తర్వుల ద్వారా ఓటరు నమోదు కోసం ఉపయోగించేటువంటి ఫారం- 6 ను కూడా సవరించలేదని స్పష్టం చేసింది. సీఈసీ పనితీరు, ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాల చట్టబద్ధతను సవాలు చేస్తూ రాకేశ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానంగా ఈసీ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌కు సీఈసీతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ప్రచురించిన రిపోర్ట్ ప్రకారం- సర్ ప్రక్రియకు సంబంధించి 14 కీలక నిర్ణయాలు తీసుకునే సమయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి 2025 జూన్ 24, 2025 అక్టోబర్ 27, 2026 మే 14 తేదీల్లో జారీ చేసిన మూడు ఉత్తర్వులు కమిషన్ ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ తన తాజా అఫిడవిట్‌లో స్పష్టం చేసింది.




**అభిప్రాయాలు, ఆలోచనలన్నీ తుది నిర్ణయాలు కావు!**

ఫైళ్ల పరిశీలన సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఇతర కమిషనర్లు వ్యక్తపరిచే అభిప్రాయాలు, ప్రశ్నలు, సూచనలు, వ్యాఖ్యలను మాత్రమే కమిషన్ తుది నిర్ణయాలుగా పరిగణించలేమని ఈసీ వివరించింది. సాధారణంగా ఒక ఫైల్ ముందుగా ఒక ఎన్నికల కమిషనర్ వద్దకు, ఆ తర్వాత రెండో కమిషనర్ దగ్గరికి, చివరికి సీఈసీ వద్దకు వెళ్తుందని పేర్కొంది. 2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, సర్వీస్ నిబంధనలు, పదవీ కాలానికి సంబంధించిన చట్టంలోని సెక్షన్ 18 ను కూడా ఈసీ ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీని ప్రకారం- సాధ్యమైనంత వరకు నిర్ణయాలను ఏకగ్రీవంగా తీసుకోవాలని, అలా సాధ్యం కాకపోతే మెజార్టీ ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని ఎన్నికల సంఘం- సుప్రీం కోర్టుకు తెలిపింది.

ఇంకా పిటిషన్‌లోని ఆరోపణలు ప్రధానంగా వార్తా పత్రిక కథనాన్ని ఆధారంగా చేసుకున్నవేనని, పిటిషనర్ సంబంధిత అధికారులతో స్వతంత్రంగా వాస్తవాలను నిర్ధరించుకోలేదని కమిషన్ వాదించింది. అందువల్ల ఈ పిటిషన్ అసలు విచారణకే అర్హత పొందాల్సింది కాదని, ఇంకా తాము అంతర్గత ఫైల్స్ లేదా నోట్స్‌ను మీడియాకు కూడా విడుదల చేయలేదని వెల్లడించింది. కాబట్టి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరిన పిటిషన్ చట్టబద్ధంగా నిలబడదని ఈసీ వాదించింది.

**ఫారం- 6 ను కూడా సవరించలేదు**

ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడానికి ఉపయోగించే ఫారం- 6 ను సర్ ఉత్తర్వుల ద్వారా సవరించారన్న ఆరోపణలను కూడా ఎన్నికల సంఘం ఖండించింది. అయితే ఓటరు నమోదు నిబంధనలు, 1960 కింద నిర్దేశించిన ఫారంలో మార్పులు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుందని వివరించింది. సర్ ఉత్తర్వుల సమయంలో తాము కోరిన డిక్లరేషన్ ఒక ప్రత్యేక డాక్యుమెంట్ మాత్రమేనని, దానినే ఫారం- 6 ను సవరించినట్లుగా పరిగణించవద్దని తెలిపింది. గతంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితాలతో తమకు లేదా తమ తల్లిదండ్రులు, తాత ముత్తాతలకు ఉన్న సంబంధాన్ని వివరించాలని దరఖాస్తుదారులను కోరడం వివాదానికి కారణమైంది. ఈ మార్పులపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు తెలిపారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది. అయితే ఇక్కడ ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెస్‌లో డిక్లరేషన్‌ను చూపించిన తీరు వల్ల ఫారం- 6 ను సవరించినట్లు భావించే అవకాశం ఉందని ఈసీ అంగీకరించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి 2026, అక్టోబర్ 21 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో ఫారం- 6, సర్ డిక్లరేషన్‌ను రెండు వేర్వేరు భాగాలుగా చూపిస్తామని తెలిపింది.

# దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యానికి పెద్దపీట

బ్రిక్స్ దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై భారత్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల నుంచి వచ్చిన పార్లమెంటరీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. దిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ ప్రారంభ సమావేశం అనంతరం ఈ భేటీ జరిగింది.




వివిధ దేశాలకు చెందిన పార్లమెంటు సభ్యులను ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా ఆహ్వానించారు. తర్వాత కొంతమంది సభ్యులతో ముచ్చటించిన మోదీ, పార్లమెంట్ భవన సముదాయంలో బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను ఉద్దేశించి ప్రసంగించిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను బలంగా వినిపించాల్సిన బాధ్యత బ్రిక్స్ దేశాలపై ఉందన్నారు. సంస్కృతి, భాషా పరంగా వైవిధ్యాలు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసమే బ్రిక్స్ దేశాలను ఐక్యంగా ఉంచుతోందని తెలిపారు. యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తతలు, ఉగ్రవాదం వంటి సవాళ్లతో ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి చర్చలు, దౌత్యం ఎంతో అవసరమని ఓంబిర్లా పేర్కొన్నారు.

**పార్లమెంటరీ వ్యవస్థలో ఆవిష్కరణలు అవసరం**

ప్రజాస్వామ్య సంస్థల పనితీరును మెరుగుపరచడంలో ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని లోక్‌సభ స్పీకర్ పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడమే ఆవిష్కరణ కాదని, కొత్త ఆలోచనలు, ప్రగతిశీల విధానాలు, సంస్థాగత సంస్కరణలు కూడా అందులో భాగమేనని వివరించారు. ఈ మార్పుల ద్వారా పార్లమెంటరీ వ్యవస్థను మరింత సమర్థంగా, పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యానికి అనుకూలంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. చర్చల నాణ్యతను పెంచడం, ప్రజలతో అనుసంధానాన్ని మెరుగుపరచడం, వారి మారుతున్న అంచనాలకు అనుగుణంగా స్పందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే పార్లమెంట్లు పారదర్శకంగా పనిచేయడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం**

యువత ఆశయాలు, ఆలోచనలు, సమస్యలను పార్లమెంట్లు శ్రద్ధగా వినాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. యువతలోని శక్తి, సృజనాత్మకత, నైపుణ్యాలను దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత పార్లమెంట్లపై ఉందని అన్నారు. వారి ఆశలు, ఆందోళనలను అర్థం చేసుకుని, విధాన రూపకల్పనలో యువత అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు కాలానుగుణంగా మారుతున్నందున పార్లమెంటరీ వ్యవస్థలు కూడా ఆ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలే ప్రజాస్వామ్య సంస్థల బలం కాదని, నిర్మాణాత్మక చర్చలు, ఏకాభిప్రాయ సాధన, పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమని వివరించారు.

**పార్లమెంటరీ సహకారంపై చర్చలు**

బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ నేతలు, ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ ఫోరమ్ పరస్పర సహకారాన్ని పెంపొందించడం, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంపై చర్చించేందుకు అవకాశం కల్పిస్తోంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

**పలు దేశాల ప్రతినిధుల హాజరు**

ఈ ఫోరమ్‌లో బ్రెజిల్, రష్యా, చైనా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇరాన్ వంటి బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. భాగస్వామ్య దేశాల నుంచి బెలారస్, క్యూబా, థాయ్‌లాండ్, ఉగాండా, వియత్నాం, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌తో పాటు పలువురు పార్లమెంటు సభ్యులు కూడా విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

# రక్షణ రంగానికి భారీ బూస్ట్

**న్యూఢిల్లీ:** దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొనుగోళ్లలో తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, దీర్ఘశ్రేణి కామికేజ్ డ్రోన్లు, ఆధునిక ఆయుధ వ్యవస్థలు, నిఘా పరికరాలు ఉన్నాయి.



**సైన్యం కోసం ఆధునిక ఆయుధ వ్యవస్థలు**

భారత సైన్యం కోసం అధిక చలనశీలత కలిగిన వాహనాలు, స్వయంచాలక ట్రాక్డ్ గన్ వ్యవస్థలు, గన్‌షాట్ రెస్పాన్స్ సిస్టమ్ (జీఎస్ఆర్ఎస్), తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, అత్యల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థలు (వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్), డ్రోన్లను ఎదుర్కొనే వ్యవస్థలు (సీ-యూఏఎస్) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే ఇతర డ్రోన్ వ్యవస్థలు, మానవరహిత వైమానిక నిఘా వ్యవస్థలు, సమీకృత నిఘా-దాడి వ్యవస్థలు, దీర్ఘశ్రేణి కామికేజ్ డ్రోన్ల కొనుగోలుకు కూడా డీఏసీ పచ్చజెండా ఊపింది. ఈ వాహనాలు కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో సైన్యం కదలికలను, రవాణా సామర్థ్యాలను మెరుగుపరచనున్నాయి. స్వయంచాలక ట్రాక్డ్ గన్ వ్యవస్థలు వేగంగా కదులుతూ కాల్పులు జరిపేందుకు ఉపయోగపడతాయి. గన్‌షాట్ రెస్పాన్స్ సిస్టమ్ యుద్ధరంగంలో కాల్పులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడంలో తోడ్పడుతుంది. తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లను భారత సైన్యం, వైమానిక దళం వినియోగించనున్నాయి. నిఘా, శోధన, రక్షణ చర్యలు, సైనికుల తరలింపు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అవసరాలకు వీటిని ఉపయోగించవచ్చు. అత్యల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థలు సమీప దూరంలో ఎదురయ్యే వైమానిక ముప్పులను అడ్డుకోవడానికి ఉపయోగపడతాయి. డ్రోన్లను గుర్తించి ఎదుర్కొనే వ్యవస్థలు సైనిక స్థావరాలు, యుద్ధ ట్యాంకులు, ఇతర కీలక రక్షణ వనరుల భద్రతను పెంచడంలో సహాయపడతాయి.

**నౌకాదళం కోసం క్షిపణి నిరోధక వ్యవస్థలు**

భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్ (ఏఓడీఎస్)తో పాటు ఇతర కీలక నౌకాదళ పరికరాల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. శత్రువుల నౌకా విధ్వంసక క్షిపణులను దారి మళ్లించి, నౌకలకు రక్షణ కల్పించడంలో ఏఓడీఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ వ్యవస్థ నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకల రక్షణ సామర్థ్యాలను మరింత పెంచనుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించనున్న నౌకాదళ పరికరాలు భారత నౌకాదళ పోరాట సామర్థ్యాలను బలోపేతం చేయనున్నాయి. దేశీయ సాంకేతిక పరిజ్ఞానానికి ప్రోత్సాహం లభించడంతో పాటు రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యానికి ఇవి దోహదపడనున్నాయి.

**వైమానిక దళానికి అధునాతన పరికరాలు**

భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, మొబైల్ ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. హెలికాప్టర్లు వైమానిక రవాణా అవసరాలను తీర్చడంతో పాటు వివిధ కార్యాచరణల్లో ఉపయోగపడనున్నాయి. ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్లు సరిహద్దు, వ్యూహాత్మక ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని అందించనున్నాయి. దీనివల్ల వైమానిక కార్యకలాపాల ప్రణాళిక, నిర్వహణ మరింత సమర్థంగా సాగేందుకు అవకాశం ఉంటుంది.

**దేశీయ పరిశ్రమలకు ప్రాధాన్యం**

రక్షణ పరికరాల కొనుగోళ్లలో స్వదేశీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ఆమోదించిన కొనుగోళ్లలో సుమారు 82 శాతం విలువైన పరికరాలను భారతీయ పరిశ్రమల నుంచే సమకూర్చుకోనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నిర్ణయం దేశీయ రక్షణ తయారీ రంగానికి ఊతమివ్వడంతో పాటు, ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానంలో విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా దోహదపడనుంది. సైన్యం, నౌకాదళం, వైమానిక దళాల అవసరాలకు అనుగుణంగా ఆధునిక పరికరాలను సమకూర్చుకోవడం ద్వారా దేశ రక్షణ సామర్థ్యాలను మరింత పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

## క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ



పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమిత్ షాను వ్యక్తిగతంగా కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ తరఫున హాజరైన న్యాయవాది వాదించారు. "ఈ కేసులో రాహుల్ గాంధీ నిర్దోషిగా విడుదలయ్యారు. ఫిర్యాదుదారునికి దావా వేసేందుకు చట్టపరమైన అర్హత లేదని కోర్టు నిర్ధారించింది. రాహుల్ గాంధీ నిర్దోషిగా తేలడం పట్ల ప్రస్తుతం మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాం. తీర్పు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించలేదు. ఈ కేసును కొట్టివేయడానికి గల నిర్దిష్ట కారణాలు లేదా ప్రాతిపదిక ఏమిటో, పూర్తి తీర్పు ప్రతిని చూసిన తర్వాతే చెప్పగలము" అని రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా అన్నారు. తాజాగా ఆ కేసులో విచారణ పూర్తి చేసిన సుల్తాన్‌పూర్ ప్రత్యేక కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. కోర్టు నిర్ణయంతో ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆ కేసుకు ముగింపు లభించింది. తీర్పు వెలువడిన సమయంలో రాహుల్ గాంధీ కోర్టులోనే ఉన్నారు. అనంతరం ఆయన బయటకు రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. డప్పులు కొడుతూ, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేశారు. కోర్టు తీర్పు తమ వాదనకు బలం చేకూర్చిందని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో బీజేపీపై రాజకీయ విమర్శలను మరింత గట్టిగా వినిపించింది. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వివాదం మొదలైంది. ఆ సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. బెంగళూరులో జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారని వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ సుల్తాన్‌పూర్‌కు చెందిన బీజేపీ నేత విజయ్ మిశ్రా కోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టు 4న విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు. ఆ కేసులో రాహుల్ గాంధీ 2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. అనంతరం కేసు విచారణ కొనసాగింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఫిర్యాదుదారుడు తప్పుబట్టగా, వాటిని సందర్భం నుంచి విడదీసి చూస్తున్నారని కాంగ్రెస్ నేత తరఫు న్యాయవాదులు వాదించారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మరోసారి విమర్శలు గుప్పించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల మార్గాలను ఉపయోగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఓటు చోరీకి సంబంధించి అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయని ఖర్గే అన్నారు. అయినప్పటికీ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కోరితే, ఎన్నికల సంఘం వాణిజ్య రహస్యాలు అనే కారణంతో సమాధానం ఇవ్వడానికి నిరాకరించిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పారదర్శకత అవసరమని డిమాండ్ చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 16.18 లక్షల ఫామ్-6 దరఖాస్తులకు సంబంధించిన వివరాలను బహిరంగంగా వెల్లడించలేదని ఆరోపించారు. పిలిభిత్ జిల్లాలో 10,470 మంది ఓటర్ల రికార్డుల్లో అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులపై విచారణకు ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఓటరు జాబితాల్లో కొత్తగా పేర్లు చేర్చడం, తొలగించడం, వివరాల్లో మార్పులు చేయడం వంటి ప్రక్రియల్లో ఈ ఫారాలు కీలక పాత్ర పోషిస్తాయి.

**మూడు ప్రధాన డిమాండ్లు**

బీజేపీకి, ఎన్నికల సంఘానికి మధ్య కుమ్మక్కు ఉందన్నది ఇండియా కూటమి ఆరోపణ అని ఖర్గే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు ప్రధాన డిమాండ్లను ముందుకు తెచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలి. అన్ని ఎన్నికలను పేపర్ బ్యాలెట్ల ద్వారా నిర్వహించాలని కూడా ఖర్గే డిమాండ్ చేశారు. ఈ పోరాటం కేవలం ఓట్ల పరిరక్షణకే పరిమితం కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రజా ఉద్యమమని వ్యాఖ్యానించారు.

**భారీ ర్యాలీకి పిలుపు**

ఓట్ చోరీకి వ్యతిరేకంగా నవంబర్ 1న దిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఖర్గే పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

**మన్ కీ బాత్‌ను పక్కన పెట్టండి : జైరాం రమేశ్**

మరోవైపు, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుంది. దీపావళికి ముందు ఆహార పదార్థాలు, డ్రై ఫ్రూట్స్ ధరలు పెరగడం సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై ప్రభావం చూపుతోందని జైరాం రమేశ్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను ప్రస్తావించిన ఓ మీడియా కథనాన్ని ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. కొన్ని ఆహార పదార్థాల ధరలు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో కుటుంబాల ఖర్చులు అధికమవుతున్నాయని ఆ కథనం పేర్కొన్నట్లు తెలిపారు. మరో కథనాన్ని ఉటంకిస్తూ పిస్తా, బాదం, జీడిపప్పు, యాలకుల ధరలు కూడా పెరిగాయని వెల్లడించారు.

**ఉల్లిపాయలు, చక్కెర ధరల పెరుగుదలపై విమర్శలు**

ప్రభుత్వ గణాంకాల ప్రకారం ద్రవ్యోల్బణం పెరుగుతోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. గత నాలుగు నెలల్లో ఉల్లిపాయల ధరలు 85 శాతం, చక్కెర ధరలు 34 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. గత నెలలోనే టమాటాల ధరలు 8.5 శాతం, కందిపప్పు ధరలు 3.5 శాతం, శనగపప్పు ధరలు 3.1 శాతం పెరిగాయని పేర్కొన్నారు. దీపావళికి ముందు కిలో బాదం ధర రూ.1,300కు చేరిందని, పచ్చి యాలకుల ధర కిలోకు రూ.300 మేర పెరిగిందని ఆయన ఆరోపించారు. ఈ ధరల పెరుగుదలతో పండుగ జరుపుకోవాలా? కుటుంబ ఖర్చులను ఎలా నిర్వహించాలా? అనే సందిగ్ధంలో సగటు కుటుంబాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

-మొదటిపేజీ తరువాయి

వికసిత్ భారత్ అంటే గ్రామస్థాయి వరకూ అభివృద్ధి సాధ్యమైనట్లేనని అన్నారు. ప్రధాని మోదీ హయాంలో విద్యా, వైద్య సంస్థలు చాలావరకు పెరిగాయని వివరించారు. ఎన్డీయే పాలనలో మెడికల్ కళాశాలలు రెట్టింపయ్యాయని ఎంబీబీఎస్ సీట్లు 172 శాతం, పీజీ సీట్లు 177 శాతం పెరిగాయవని వెల్లడించారు. పరిశోధనల్లో మరింత ఉత్సాహం, ప్రతిభ చూపాల్సిన సమయమిదని అన్నారు. సమస్యకు పరిష్కారం చూపగలిగితేనే ఏదైనా సాధ్యమవుతుందని ఉపరాష్ట్రపతి చెప్పారు.

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఏపీలో నాలుగు దశాబ్దాలుగా ఆరోగ్య శాస్త్ర విద్య అభివృద్ధిలో ఎన్టీఆర్ వర్సిటీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. వైద్య విశ్వవిద్యాలయ స్థాపనలో ఎన్టీఆర్ దూరదృష్టి కీలకమని కొనియాడారు. ఎంతో మంది వైద్యులు, నర్సులు, దంతవైద్యులు , అనుబంధ ఆరోగ్య సంరక్షణ నిపుణులను తయారు చేసిందని చెప్పారు. ఈ అద్భుతమైన ప్రయాణానికి కృషి చేసిన విశ్వవిద్యాలయ నాయకత్వాన్ని అభినందించారు. వైద్య విద్యారంగంలో ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని కొనియాడిన ఉపరాష్ట్రపతి వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా వైద్య విద్య విస్తరణ జరగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు వైద్యవిద్యతో పాటు అధునాతన పరిశోధనలపై దృష్టి సారించాలని క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు పరిష్కారాలు కనుగొనాలని ఉపరాష్ట్రపతి సూచించారు. పరిశోధనల్లో విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని కోరారు. వైద్యవృత్తిలో రోగుల పట్ల మానవత్వం, ఆప్యాయత చాలా ముఖ్యమని సూచించారు. డ్రగ్స్ వినియోగం అరికట్టేందుకు వైద్యులు, యువత చొరవ తీసుకోవాలని వాటి దుష్ప్రభావాలపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

"ఉన్నత విద్యను అందరికీ అందించడమే వికసిత్ భారత్ లక్ష్యం. ప్రధాని మోదీ నాయకత్వంలో వైద్య విద్యారంగం గణనీయ విస్తరించింది. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలు భారీగా పెరిగాయి. దేశంలో వైద్య కళాశాలల సంఖ్య రెండింతలకు పైగా పెరిగింది. 21 వేలు ఉన్న ఎంబీబీఎస్ సీట్లు ప్రస్తుతం 1.20 లక్షలకు పెరిగాయి."




**పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం**

దేశంలోనే తొలి వైద్య వర్సిటీగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి గుర్తింపు ఉందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, ప్రజారోగ్య సేవల్లో ఈ వర్సిటీ ప్రత్యేక స్థానం సాధించిందని చెప్పారు. వైద్య విద్యలో ఏఐ, డిజిటల్ అభ్యసనానికి ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్ అవసరమని చెప్పారు. ఎన్టీఆర్ వర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఏపీ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సీపీ రాధాకృష్ణన్?కు రాష్ట్ర గవర్నర్? అబ్దుల్ నజీర్, సీఎస్? సాయి ప్రసాద్, మంత్రి నారా లోకేశ్?, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అలానే ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, కలెక్టర్ డీకే బాలాజి, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు.

# అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కార్ హైఅలర్ట్

అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కారు హైఅలర్ట్ ప్రకటించింది. క్షణక్షణం తుపాను కదలికలపై నిఘా పెట్టి ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణతో ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావం, వర్షాలు, గాలులు, వరద ప్రవాహాల తీవ్రతను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అర్నబ్ తుపాను ప్రభావం పై ముఖ్యమంత్రి చంద్రబాబు, వివిధ శాఖల మంత్రులు వరుస సమీక్షలు చేపట్టి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతే కీలకమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో వచ్చిన తుపాన్ల సమాచారాన్ని విశ్లేషించి, ప్రస్తుత పరిస్థితులతో పోల్చుతూ ప్రమాద తీవ్రతను అంచనా వేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని, తీర ప్రాంత ప్రజలను తుపాను షెల్టర్లకు తరలించే ప్రక్రియను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

**రేపటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం**

తుపాను కదలికలు, తీరం దాటే అంచనాలపై హోంమంత్రి అనిత వివరాలు వెల్లడించారు. అర్ధరాత్రికి తుపాను తీవ్రంగా, రేపటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లుండి ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశముందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచవచ్చని వివరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని స్పష్టం చేశారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పునరుద్ధరణకు వెంటనే



చర్యలు చేపట్టాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అవసరమైన సిబ్బందిని, పరికరాలను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తే వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.

**ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలపై నిరంతరం పర్యవేక్షణ**

సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, నదులు, కాలువల వద్ద నీటి మట్టాలు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలను నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వరద ముప్పున్న ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలోని బుడమేరు కాలువ, ఏలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో పనులు కొనసాగిస్తూ, 2027 మార్చి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. రహదారులపై చెట్లు కూలినా, రాకపోకలకు అంతరాయం కలిగినా వెంటనే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ప్రమాదకర వంతెనలు, కల్వర్టుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, కలెక్టర్లు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణం అనుకూలించినప్పుడు కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర, కంది పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై టార్పాలిన్లు కప్పాలని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షాలు పడే సమయంలో యూరియా, పైపాటుగా వేసే ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలకు నష్టం కలగకుండా అరటి, బొప్పాయి మొక్కలకు ఆసరా ఏర్పాటు చేయాలని, పందిరి పంటల నిర్మాణాలను బలోపేతం చేయాలని అచ్చెన్నాయుడు సూచించారు. పశువులు, కోళ్లు ఉండే షెడ్లలోకి నీరు చేరకుండా చూడాలని, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, మోటార్లు, డ్రిప్ పరికరాలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని తెలిపారు. తుపాను తర్వాత పంటలకు తెగుళ్లు, వ్యాధులు సోకకుండా వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**ప్రజల ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం**

తుపాను వేళ ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, చెట్లు, హోర్డింగులు, బలహీనమైన భవనాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండటంతో పాటు ఇప్పటికే సముద్రంలో ఉన్న బోట్లు సురక్షిత తీరానికి చేరుకోవాలని హెచ్చరించారు. తుపాను అనంతరం పంటలు, పశువులు, వ్యవసాయ పరికరాలకు జరిగిన నష్టాన్ని నమోదు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని, బీమా క్లెయిమ్‌లకు అవసరమైన ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని, అన్ని వేళలా ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

# గుంతల 'దారి' అద్దంలా మారి - కూటమి ప్రభుత్వంలో 23,379 గుంతల పూడ్చివేత

రహదారులు అభివృద్ధికి చిహ్నాలు. అవి బాగుంటేనే పెట్టుబడులొస్తాయి. పరిశ్రమలు ఏర్పాటవుతాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కానీ మాజీ సీఎం జగన్, ఆయన పార్టీ నేతలకు రహదారుల నిర్మాణం ఓ దండగమారి వ్యవహారం. అందుకే ఐదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతుల సంగతే పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులూ చెల్లించలేదు. ఫలితంగా వారు టెండర్లనే బహిష్కరించారు. అధికారం నుంచి దిగిపోయేనాటికి పట్టణ ప్రాంత రహదారుల్లో 23,379 గుంతలు పడేలా నిర్లక్ష్యం వహించడమే జగన్ ఘనత! పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అమలుచేస్తే రోడ్లు బాగుచేయనక్కర్లేదనేది వారి నైజం. రోడ్లపై నడవ లేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజల్ని, సంక్షేమం అందిస్తున్నాం చాలదా? అంటూ ఈసడించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధప్రాతిపదికన పట్టణాల్లో గుంతల పూడ్చివేత కార్యక్రమం చేపట్టింది. 9 నెలల్లోనే 95% గుంతల్ని పూడ్చివేసింది.

**వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో**

రోడ్డేస్తే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయా అనేది అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్న. 'పింఛన్లు ఆపితే రోడ్లన్నీ అద్దాల్లా చేయొచ్చు. ఒక్కనెల పింఛన్ ఇవ్వకపోతే ముసలోళ్లు ఒప్పుకొంటారా?' అనేది రాయలసీమకు చెందిన ఓ ఎమ్మెల్యే వ్యాఖ్య. పింఛన్లు, ఇతర పథకాలు ఇస్తున్నామంటూ అభివృద్ధి పనులకు నాడు చాప చుట్టేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని రెట్టింపు చేసింది. జగన్ సర్కారులో పింఛన్‌గా నెలకు రూ.2 వేలిస్తే కూటమి ప్రభుత్వం రూ.4 వేల చొప్పున ఇస్తోంది. అలాగని రహదారుల నిర్మాణం, మరమ్మతులను విస్మరించలేదు. జగన్ హయాంలో గుంతలమయం చేసిన రహదారులకు మరమ్మతులు చేశారు. కొత్త రహదారుల పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది, అప్పుడు జగన్ ఎందుకు చేయలేకపోయారు?

**కూటమి ప్రభుత్వంలో తొలి 6 నెలల్లోనే :**

కూటమి అధికారంలోకి రాగానే పట్టణ రహదారులపై దృష్టి సారించింది. మరమ్మతులకు నిధులు కేటాయించింది. గుర్తించిన 23,379 పనుల్లో ఆరునెలల్లోనే 53.5% పూర్తిచేసింది. మరో మూడు నెలల్లో 95% పైగా రహదారుల్లో గుంతలు పూడ్చే పనులు చేసింది.

పురపాలక సాధారణ నిధుల నుంచి ఏడాదికి రూ.20 కోట్ల వరకు గుంతలు పూడ్చేందుకే ఖర్చు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది మొత్తం 14,118 గుంతలు గుర్తించగా, 11,074 పూడ్చారు.

హ్యామ్ విధానంలో రూ.5,500 కోట్లతో పట్టణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు.

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో : 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పట్టణ రహదారుల నిర్మాణం, మరమ్మతులకు ప్రాధాన్యమిచ్చింది. 2,772 కి.మీ కొత్త రహదారులు నిర్మించారు. 2019 ఎన్నికల నాటికి సీఐఐపీ (క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ఫేజ్-1 కింద రూ.2,312 కోట్లతో 3,594 కి.మీ రహదారులు వేశారు. ఫేజ్-2 కింద రూ.1,214 కోట్లతో 1,888 కి.మీ రహదారుల నిర్మాణ పనుల్ని పట్టాలెక్కించారు. 14వ ఆర్థికసంఘం, రాష్ట్ర ఆర్థికసంఘం, ఉప ప్రణాళిక నిధుల నుంచి రూ.1,986 కోట్లతో రహదారులు, కాలువలు నిర్మించారు. సాధారణ ప్రణాళిక నిధుల నుంచి రూ.2,200 కోట్లు, కార్పొరేషన్ల సొంత నిధుల నుంచి రూ.2,100 కోట్లు ఖర్చుపెట్టారు.

**2019-24 మధ్య వైఎస్సార్సీపీ పాలనలో**

2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో రహదారుల విస్తీర్ణం 18,483 కి.మీ. ఆ పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ కొత్త రోడ్ల ఊసే లేదు సరికదా, ఉన్నవి గుంతలమయమయ్యాయి. వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక, అంతకుముందు టీడీపీ హయాంలో పట్టాలెక్కించిన రహదారుల నిర్మాణాన్నీ మూలన పెట్టింది. గుంతలు మోకాల్లోతుకు చేరినా తట్టెడు మట్టి పోయలేదు. మొత్తం 25 జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్లలో రహదారులకు 23,379 గుంతలు ఏర్పడ్డాయి. ఆటోలు పాడవుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని డ్రైవర్లు చెప్పినా అప్పటి సర్కారు చెవికెక్కలేదు. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం కావడంతో అప్పటి సీఎం జగన్, సమీక్ష సమావేశాలు పెట్టి రోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలని చెప్పారు. కానీ వాటికి నిధులు విదల్చలేదు. 2021, 2022 సంవత్సరాల్లో గుంతల పూడ్చివేతకు రూ.120 కోట్లు, రూ.180 కోట్లు కేటాయించినా 40% కూడా పనులు పూర్తికాలేదు. బిల్లులు చెల్లించకపోవడమే దీనికి కారణం.

## వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులకు బి - ఫారమ్ లు పంపిణీ





? మామిడికుదురు, అక్టోబర్ 26 ( మీ వార్త విలేఖరి ): మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయనున్న ఎంపీటీసీ లకు రాజోలు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి పాముల రాజేశ్వరి దేవి బి- ఫారమ్ లను అందజేశారు. ?ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ ఇంచార్జ్ గన్నవరపు శ్రీనివాసరావు,భూపతిరాజు సత్తిబాబు రాజు , కటకంశెట్టి ఆదిత్య , బోలిశెట్టి భగవాన్ , కొమ్ముల రాము, మరియు మండల వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెడన టౌన్ వార్డు సిగ్మెట్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం



పెడన అక్టోబర్ 26(మీ వార్త ప్రతినిధి) పెడన టౌన్ లోని 23 వ వార్డు లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున 23వ వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న వీణం రాము వార్డ్ లో ప్రచారం నిర్వహిస్తూ, వార్డ్ ప్రజలను ఆత్మీయంగా కలుసుకుంటూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.వార్డ్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతూ, ప్రజల ఆశీస్సులు మరియు మద్దతును కోరుతున్నారు.పెడన 23 వ వార్డు అభ్యర్థి వీణం రాము కి మద్దతు తెలియజేయండి.మన గుర్తు -- ఫ్యాన్ గుర్తు! ఈ కార్యక్రమంలో పెడన టౌన్ అధ్యక్షులు బండారు మళ్ళీ ఎర్ర టార్జాన్ జక్కుల పుల్లారావు, పృథ్వి గంట శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## మిత్రధర్మం పాటించాల్సిందే..

-మొదటిపేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో చక్కటి సమన్వయం ఉండాలని చంద్రబాబు గట్టిగా సూచించారు. "కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలవాలి. మిత్రధర్మాన్ని పాటించడంలో ఎలాంటి వెసులుబాటు ఉండదు. మూడు స్థాయిల్లోనూ (కేంద్ర, రాష్ట్ర, స్థానిక) ఒకే ప్రభుత్వం ఉంటే జరిగే అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. వార్డు, డివిజన్ మొదలు ప్రతి స్థానంలోనూ కూటమి జెండాలు ఎగరాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**కష్టపడ్డవారికి గుర్తింపు.. నామినేటెడ్ పదవులు**

పొత్తులు, రిజర్వేషన్లు, సామాజిక సమీకరణాల కారణంగా కొంతమంది నేతలకు స్థానిక ఎన్నికల్లో అవకాశాలు దక్కకపోవచ్చని చంద్రబాబు అంగీకరించారు. "పార్టీ కోసం, రాష్ట్రం కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుంది. అలాంటి వారికి నామినేటెడ్ పదవులతో గౌరవిస్తాం. పాలనలో తాము కూడా భాగస్వాములమనే సంతృప్తి ప్రతి వర్గానికి కలగాలి. అందుకే బీసీలకు, చిన్న కులాలకు కూడా ఈ ఎన్నికల్లో ప్రాధాన్యత ఇచ్చాం" అని భరోసా ఇచ్చారు. అగ్ర నేతల నుంచి కార్యకర్తల వరకు అందరి పనితీరును రికార్డ్ చేస్తున్నామని తెలిపారు.

**గొడ్డలి పార్టీపై ప్రజలను అప్రమత్తం చేయాలి**

ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తూనే, ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలి. ఆ పార్టీ అధ్యక్షుడు తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఎలా తాకట్టు పెడతాడో, కుటుంబ బంధాలను కూడా ఎలా పట్టించుకోడో ప్రజలకు తెలియజేయాలి. ప్రతి ఓటరు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేలా చూడాలి. 2024 ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు ప్రతి బూత్‌లోనూ పడాలి" అని ఆయన లక్ష్య నిర్దేశం చేశారు.

## విశాఖ తూర్పు తీరాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దుతాం

ప్రకృతి అందాలు, టెక్నాలజీ హంగులు ఈ రెండింటి కలయికతో విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. గంగవరం బీచ్ అందాలను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ప్రపంచానికి పరిచయం చేయగా, విశాఖ ప్రత్యేకతను చాటినందుకు ఆయనకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కొండలు సముద్రాన్ని తాకే తీరం, ఎత్తైన రాతి కొండచరియలు, వేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీ రంగం ఇవే విశాఖ అసలైన బలాలని వివరించారు. ప్రకృతి సౌందర్యాన్ని దెబ్బతీయకుండా ప్రపంచ స్థాయి సాంకేతిక పరిశ్రమలు అభివృద్ధి చెందేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ విజన్ అని లోకేశ్ తెలిపారు. తూర్పు తీరానికి శాన్‌ఫ్రాన్సిస్కోగా విశాఖను నిలబెడతామన్నారు. ప్రకృతి, ప్రగతి కలిసి నడిచే నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేశ్ వెల్లడించారు. గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా చేసిన పోస్టుకు మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు.

**గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్టు :**

విశాఖపట్నం సమీపంలోని గంగవరం బీచ్ సుందర దృశ్యాలకు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఫిదా అయ్యారు. దీంతో గంగవరం బీచ్ గురించి ఆనంద్ మహీంద్రా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. దేశంలో ఎక్కువ మంది మాట్లాడుకునే తీరప్రాంత ప్రదేశాల్లో గంగవరం బీచ్ ఎందుకు లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఇది మనకు తెలిసిన కొబ్బరి చెట్లు, పచ్చదనం దృశ్యాలు కనిపించే సాధారణ బీచ్ లాంటిది కాదు. ఎత్తయిన రాతి కొండలతో కఠినమైన, ఒకవిధమైన పురాతన అందం ఇక్కడ కనిపిస్తోంది. ఇలాంటి సహజ సౌందర్యమే నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఇక్కడ సేద తీరడమే కాకుండా, ప్రశాంతంగా కాసేపు ఆత్మపరిశీలన కూడా చేసుకోవచ్చు.

ప్రస్తుతం ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు. భారీ డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల నిర్మాణానికి వైజాగ్‌కు వస్తున్నాయి. కానీ, ఇక్కడి దృశ్యాలను చూస్తుంటే లక్షల ఏళ్ల క్రితమే ప్రకృతి పెద్దఎత్తున విస్తరణ ప్రక్రియను మొదలుపెట్టినట్లు అనిపిస్తోంది. విశాఖపట్నం ప్రధాన టెక్ హబ్‌గా వేగంగా మారుతోంది. అదేవిధంగా అత్యంత అద్భుతమైన తీరప్రాంత పర్యాటక ప్రదేశంగానూ వెలుగొందే సత్తా దీనికి ఉందని భావిస్తున్నా" అని ఆనంద్ మహీంద్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. నెటిజన్లు ఆయన వ్యాఖ్యలతో ఏకీభవించారు.

## ఏపీలో అర్నబ్ తుపాను ఎఫెక్ట్ ఆ జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు



రాష్ట్రంలో అర్నబ్ తుపాను ప్రభావిత జిల్లాల్లో విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈనెల 27, 28 తేదీల్లో అధికారులు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిం చారు. విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఎన్టీఆర్, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం

# రైతుల సమస్యలను పరిష్కరించాలి





## ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు

**తల్లాడ, మీ వార్త విలేఖరి.26.10.2026**
తల్లాడ మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, బీజేపీ కిసాన్ మోర్చా ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు బాధిత రైతులతో కలిసి సోమవారం తల్లాడలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

**రెండేళ్లుగా అందని పశువుల షెడ్డు బిల్లు**
అన్నారుగూడెం గ్రామానికి చెందిన రైతు బీరెల్లి సామేలు రెండేళ్ల క్రితం పశువుల షెడ్డు నిర్మించుకున్నప్పటికీ, ఇప్పటివరకు బిల్లు మంజూరు కాలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత గ్రామసభలో బిల్లు మంజూరైనట్లు ఆయన పేరును ప్రకటించినప్పటికీ, నేటికీ నగదు అందకపోవడంపై వినతిపత్రం సమర్పించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**ఎకరం భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలి**
అన్నారుగూడెం గ్రామానికి చెందిన రైతు ముద్రబోయిన నాగమణికి చెందిన ఎకరం వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని అధికారులను కోరారు. అర్హత ఉన్నప్పటికీ పాస్ పుస్తకం మంజూరు కాకపోవడంతో రైతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**పదేళ్లుగా తిరుగుతున్నా పాస్ పుస్తకం అందని రైతు**
వెంగన్నపేట గ్రామానికి చెందిన రైతు తొండపు ప్రసాదరావుకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల వ్యవసాయ భూమి రెవెన్యూ రికార్డుల్లో అధికారుల పొరపాటు కారణంగా ఇతరుల పేరుపై నమోదైందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం గత పదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు తన భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు కాలేదని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి, తప్పులను సరిదిద్ది, అర్హుడైన రైతుకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, సంబంధిత రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయడంతో పాటు అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించి న్యాయం చేయాలని ఆపతి వెంకట రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాడవల్లి నాగేశ్వరరావు, బాధిత రైతులు బీరెల్లి సామేలు, ముద్రబోయిన నాగమణి, తొండపు ప్రసాదరావు, పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన లోటస్ హైస్కూల్ విద్యార్థులు

**తాడేపల్లిగూడెం అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)**
స్థానిక పెదతాడేపల్లిలోని లోటస్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల అక్టోబర్ 15న తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడ్జామ్ అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో అడ్డాల జై మణి వెంకట దేవేంద్ర ట్రయథ్లాన్-సి, లాంగ్ జంప్, 60 మీటర్ల రన్, 600 మీటర్ల రన్ మరియు కిడ్స్ జావెలిన్ ఈవెంట్లలో ప్రథమ స్థానం సాధించాడు. అండర్-16 విభాగంలో ఎస్. హర్షిత్ 80 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్ లో ద్వితీయ స్థానం సాధించాడు. విజేతలుగా నిలిచిన ఈ ఇద్దరు విద్యార్థులు నవంబర్ 14న హైదరాబాద్ లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా అంతే ముఖ్యమని, భవిష్యత్తులో ఇటువంటి ఎన్నో విజయాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల



సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, దృఢత్వాన్ని అందిస్తాయని, అందుకే ప్రతి విద్యార్థి క్రీడల వైపు మొగ్గు చూపేలా పాఠశాల యాజమాన్యం నిరంతరం ప్రోత్సహిస్తోందని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ బొలిశెట్టి దేవి ప్రియ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని, జాతీయ పోటీలకు వెళ్తున్న విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏడుగురాళ్లపల్లి పంచాయతీలో వైసీపీలోకి 36 కుటుంబాలు చేరిక





## కండువా కప్పి ఆహ్వానించిన మాజీ జడ్పీటీసీ, చిచ్చుడి మురళి

**చింతూరు,అక్టోబర్ 26 మీ వార్త ప్రతినిధి :**
చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని చుక్కలపాడు గ్రామానికి చెందిన 36 కుటుంబాలు సీపీఎం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీ (వైసీపీ)లో చేరాయి.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలు,స్థానిక వైసీపీ నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరినట్లు గ్రామస్థులు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు,మాజీ జడ్పీటీసీ చిచ్చుడి మురళి వారికి వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఎన్నో ఏళ్లుగా సీపీఎంలో కొనసాగుతున్నప్పటికీ గ్రామంలో ఆశించిన అభివృద్ధి జరగలేదని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు.అనంతరం ఏడుగురాళ్లపల్లి ఎంపీటీసీ వైసీపీ అభ్యర్థి ఉయిక నాంచారిని పరిచయం చేస్తూ,రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు గ్రామస్థులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఎడమ అర్జున్,మాజీ సర్పంచ్ సవలం సత్తిబాబు,మాజీ ఉప సర్పంచ్ బి.బాబురావు, చింతూరు మాజీ సర్పంచ్ కారం కన్నారావు,యూత్ అధ్యక్షుడు మడవి రాజు, మీడియం లక్ష్మణ్,సోయం నాగేశ్వరరావు,వెట్టి జోగయ్య,కుమార్, నర్సింహులు,బాబురావు, రమణ,మడకం రమేష్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లవరం గ్రామపంచాయతీ నందు గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు





మల్లవరం గ్రామంలో ఈరోజు ఖమ్మం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.ఎంపీడీవో గారి ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ గారి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐజూూ యూనిట్ కౌన్సిలర్ శ్రీమతి నిరోషా గారు హాజరై కమిటీ ముఖ్య ఉద్దేశాలను, విధివిధానాలను వివరించారు.గ్రామంలో బాలల హక్కులకు భంగం కలగకుండా చూడటం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం, పిల్లలందరూ నిర్బంధంగా పాఠశాలకు వెళ్లేలా చూడటం ఈ కమిటీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ రాజు గారు, గ్రామ సర్పంచ్ కటికి కిరణ్ గారు, పంచాయతీ సెక్రటరీ సిద్దిక్ గారు, ఉప సర్పంచ్ యశోద గారు,ూ×ణ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి రామదాసు గారు, అంగన్వాడీ టీచర్లు,ూచీవీ, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమలా పురం రిపోర్టర్స్ క్లబ్ ఏర్పాటు

**అమలాపురం, మీ వార్త ప్రతినిధి,అక్టోబర్,26** కోనసీమ జిల్లాకేంద్రం లో సీనియర్ జర్నలిస్ట్ జి ఎన్ రావు (పండుబాబు )సారథ్యంలో, జర్నలిస్టులు సంక్షేమం కోసం "అమలాపురం రిపోర్టర్స్ క్లబ్"(ప్రింట్ మీడియా )ఏర్పాటు. సంఘము లో ప్రింట్ మీడియా జర్నలిస్టులు సభ్యులు గా వుంటారు.జర్నలిస్టులు కోసం పలు కార్యక్రమాలు చెపడతామ న్నారు. అమలాపురంలో సంఘ కార్యాలయం ఏర్పాటుచేసి నట్లు తెలిపారు.

ARC
AMALAPURAM REPORTERS CLUB

## డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు




**తాడేపల్లిగూడెం అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకటరామన్నగూడెంలోని డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిపాలనా కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎం. మాధవి హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజానికి వాల్మీకి మహర్షి అందించిన రామాయణ మహాకావ్యం ఎంతో గొప్పదని, అందులోని ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా డీన్ ఆఫ్ హార్టికల్చర్ డా. బి. ప్రసన్న కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డా. సిహెచ్. రూత్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా. టి. పద్మలత, జాయింట్ రిజిస్ట్రార్ వి. ఆనందబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి, నాన్ టీచింగ్ అధికారులు భరద్వాజ్, నరసింహులు, కిరణ్, బంగార్రాజు తో పాటు విశ్వవిద్యాలయానికి చెందిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వాల్మీకి మహర్షికి నివాళులర్పించారు.

## తుఫాన్ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అప్రమత్తమైన విద్యుత్ శాఖ.



**రౌతులపూడి అక్టోబర్ 26 :( మీ వార్త న్యూస్ ప్రతినిధి)** బంగాళాఖాత సముద్రంలో ఏర్పడిన ఆర్నాబ్ తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కోవడానికి రౌతులపూడి మండల విద్యుత్ శాఖ అప్రమత్తమయింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడిన కారణంగా రౌతులపూడి పరిసర ప్రాంతాలలో ఈదురుగాలులు మరియు వర్షాల వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున సిబ్బంది అందుబాటులో ఉండాలని విద్యుత్ శాఖ ఏయి బి సూర్యనారాయణ సూచించారు.సిబ్బంది ఎప్పటికప్పుడు విద్యుత్ పునరుద్ధరణ పనులలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈదురుగాలుల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా, స్తంభాలు దెబ్బతిన్నా వాటికి సమీపంలోకి వెళ్లకుండా వెంటనే విద్యుత్ శాఖకు ప్రజలు సమాచారం అందించి సహకరించాలన్నారు.విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ : 1912 మరియు 9490610090, సబ్ -స్టేషన్ 9490614820 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

# మచిలీపట్నం అభివృద్ధి చెందాలంటే మేయర్ విద్యావంతులై ఉండాలి....

## మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకి శెట్టి బాలాజీ

**మచిలీపట్నం, అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** ఎంతో చరిత్ర కలిగిన మచిలీపట్నం అభివృద్ధి ఆగిపోయిందని అటువంటి నగరాన్ని అభివృద్ధి చెందాలంటే మేయర్గా విద్యావంతురాలు ఉండాలని మచిలీపట్నం అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకెశెట్టి బాలాజీ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా, కార్పొరేటర్ అభ్యర్థి హసీమ్ బేగ్ తదితరులు సోమవారం మచిలీపట్నం అసోసియేషన్ కి వచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ కులాలకు మతాలకు రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధి కావాలంటే 60 డివిజన్లు ఉన్న మచిలీపట్నానికి మేయర్ గా అభిదా వంటి విద్యావంతురాలు ఉండాలని బాలాజీ అన్నారు జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నంలో కనీస మౌలిక సౌకర్యాలు అందాలన్నా రాబోయే బందరు పోర్ట్ గోవా షిప్ యార్డ్ వంటి ప్రాజెక్టులకు మచిలీపట్నం కార్పొరేషన్ పరిపాలన ఎంతో అవసరం అని అన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వపరంగా అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవాలని కొల్లు రవీంద్ర కు బాలాజీ విజ్ఞప్తి చేశారు. సాయిబాబా గుడి నుండి జిల్లా కోర్టు వరకు సెంట్రల్ లైటింగ్ తో డబల్ రోడ్డు ఏర్పాటు చేయాలని లంకిశెట్టి కోరారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్కు నూతన బిల్డింగును నిర్మాణం చేయాలని అందుకు ప్రభుత్వ పరంగా నిధులు కూడా కేటాయించాలని కోరారు మేయర్ అభ్యర్థి అభిదా ను లంకిశెట్టి బాలాజీ కార్యాలయం జూనియర్ న్యాయవాదులు పూలమాలతో సన్మానించారు. పెద్ద సంఖ్యలో హాజరైన న్యాయవాదులు అబీదకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మచిలీపట్నం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ సోడిశెట్టి బాలాజీ రావు మాజీ జిల్లా పబ్లిక్



ప్రాసిక్యూటర్ పరసా మధుసూదన రావు, మాజీ ప్రభుత్వ సహాయ న్యాయవాది సిద్దినేని సాయిబాబు, బార్ అధ్యక్షులు తుంగల హరిబాబు కార్యదర్శి సర్వా లలితకుమారి మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనపరెడ్డి శ్రీనివాసరావు బ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి ఫణి కుమార్ తదితరులు ప్రసంగించి మద్దతు తెలియజేశారు

# అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

## ఏలూరు సర్కిల్ కార్యాలయంతో పాటు ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

**ఏలూరు, అక్టోబర్ 26:** బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో ఏలూరు జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, తుఫాన్ ప్రభావంతో తలెత్తే ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏపీఈపీడీసీఎల్ (ఇూాఝూణఝూ) విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.ఎం. అంబేద్కర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

**మూడు కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు**

తుఫాన్ ప్రభావిత పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు, విద్యుత్ అంతరాయాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏలూరు సర్కిల్ కార్యాలయంతో పాటు ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయాల్లో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు.

కంట్రోల్ రూమ్‌ల సంప్రదింపు వివరాలు:

1. ఏలూరు సర్కిల్ కార్యాలయం, విద్యుత్ భవన్, ఆర్.ఆర్.పేట, ఏలూరు: 9440902926
2. ఏలూరు డివిజన్ కార్యాలయం: 9440904037
3. జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయం:



9491030712

అదేవిధంగా, విద్యుత్ సంబంధిత ఫిర్యాదులను టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా కూడా నమోదు చేయవచ్చని ఆయన సూచించారు.

# పెన్షన్ వాలిడేషన్ బిల్లు పెన్షనర్ల పాలిట శాపం

## ఉద్యమించాలని జిల్లా అధ్యక్షులు బి హరికుమార్ పిలుపు

**తాడేపల్లిగూడెం అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పెన్షన్ వాలిడేషన్ బిల్లు పెన్షనర్ల పాలిట శాపంగా మారిందని, దీనిపై ప్రతి పెన్షనర్ ఉద్యమించాలని రాష్ట్ర పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు బి. హరికుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సోమవారం జిల్లా నూతన కౌన్సిల్ తొలి సమావేశం జిల్లా అధ్యక్షులు బి. హరికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు డి. బాపిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దాసం నాగేశ్వరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె. కామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వైవి. సత్యనారాయణమూర్తి, జిల్లా ముఖ్య సలహాదారులు కెవి. రామారావు, ఎం. అర్జున్ రావు, జిల్లా కోశాధికారి వి. రామ్మోహన్రావు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురం, మార్టేరు, ఆకివీడు యూనిట్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షులు బి. హరికుమార్ మాట్లాడుతూ కేంద్ర బిల్లును వ్యతిరేకించాలన్నారు. 2019 డిఏ కి సంబంధించి ఉద్యోగులకు నిధి పోర్టల్ లో బిల్లు పెట్టుకునేందుకు అనుమతినిచ్చి, పెన్షనర్లకు సంబంధించిన 2019 డిఆర్ బకాయిలపై ఎటువంటి




నిర్ణయం తీసుకోకపోవడం పెన్షనర్లను నిరాశకు గురిచేసిందని జిల్లా సహాధ్యక్షులు ఎస్. చలపతిరావు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా శాఖకు ఎన్నికల అధికారి డి. బాపిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దాసం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి ఫలితాలను వెల్లడించారు. జిల్లా అధ్యక్షులుగా బి. హరికుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె. కామరాజు, సహాధ్యక్షులుగా వీరా రావు, ప్రసాద్ రావు, బలరామరాజు, చిన్నయ్య, మార్కండేయులు, ప్రధాన కార్యదర్శిగా వైవి. సత్యనారాయణమూర్తి, కోశాధికారిగా వి. రామ్మోహన్రావు ఎన్నికైనట్లు ప్రకటించారు. పెన్షనర్ల సమస్యలైన డిఆర్ బకాయిలు, పిఆర్సి బకాయిలు, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ గురించి రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుని వెంటనే బకాయిలను చెల్లించాలని సమావేశంలో కోరారు.

# 8,9 డివిజన్లలో మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ప్రచారం.





**నెల్లూరు జిల్లా సిటీ అక్టోబర్ 26 (మీ వార్తా ప్రతినిధి)** నగర అభివృద్ధితో పాటు,డివిజన్లలో చేసిన పనులను వివరిస్తూ ముందుకు సాగిన రమాదేవి.
ఆప్యాయ పకరింపులతో ఓటర్ల మనసు గెలుచుకుంటున్న మంత్రి సతీమణి. రెండున్నరేళ్లలో డివిజన్ పరిధిలో జరిగిన అభివృద్ధికి ఫిదా అవుతున్న స్థానికులు.
మంగళ హారతులు,అడుగడుగు నీరాజనాలతో రమాదేవిపై పూల వర్షం కురిపించిన మహిళలు.రోడ్ షోలు,ఇంటింటి ప్రచారాలతో తెలుగు తమ్ముళ్లలో జోష్
కార్పొరేటర్ అభ్యర్థులుగా మామిడాల మధు,తాలూరి శశి కుమార్ లతో పాటు మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ ని ఆశీర్వదించాలని కోరిన రమాదేవి.
అభివృద్ధిని చూసి ఓట్లేయండంటూ విజ్ఞప్తి.
ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం.
ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆర్థిక ఇబ్బందుల్లోనూ అభివృద్ధిలో రాజీ పడకుండా ముందుకు సాగుతోంది.
నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
అభివృద్ధికి మంత్రి నారాయణ కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తున్నారు.
స్థానిక సమస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అత్యధిక మెజారిటీ ఇచ్చి అభివృద్ధికి అండగా నిలవాలి.

# మున్సిపాలిటీలో 48 వార్డుల ఓటర్ల జాబితా ప్రదర్శన

## పరిశీలించుకోవాలని కమిషనర్ ఏసుబాబు పిలుపు



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం డీ-లిమిటేషన్ లో భాగంగా 35 వార్డుల నుండి 48 వార్డులుగా విభజించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 48 వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాను పరిశీలన కోసం పురపాలక కార్యాలయంలో ప్రదర్శించారు. అదే విధంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, కోర్టు, ఆర్డీఓ ఆఫీస్, ఎంఆర్వో ఆఫీస్ మరియు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. యేసుబాబు మాట్లాడుతూ 48 వార్డులకు గాను మొత్తం 1,00,728 మంది ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రచురించామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు, వార్డు నంబర్, పోలింగ్ స్టేషన్ వివరాలను పరిశీలించుకోవాలని, 48 వార్డులకు సంబంధించిన మ్యాప్ ను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి. భవాని బాబు, మున్సిపల్ మేనేజర్ పి. ప్రసాద్ రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి. సీతారాం, స్వర్ణ గ్రామం వార్డు మేనేజర్ నాగరాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జి.మాడుగుల జెడ్పీటీసీ అభ్యర్థి ఐసరం మహేశ్వరి



**జీ.మాడుగుల(మీ వార్త ప్రతినిధి)** జి మాడుగుల జడ్పిటిసి స్థానానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరు ఎవరు అనే సందేహానికి సోమవారం తెర దించుతూ పార్టీ అధిష్టానం ఐసరం మహేశ్వరికి జడ్పిటిసి అభ్యర్థిగా సీట్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు మస్యరాస విశ్వేశ్వరరాజు సోమవారం ఐసరం మహేశ్వరికి,బీఫామ్ అందజేశారు. అనంతరం మహేశ్వరి పాడేరు పిఓ ఆఫీసుకు చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి బీఫాం అందజేశారు . జీ మాడుగుల మండలం స్థానిక సంస్థల ఎన్నికల్లో జీ.మాడుగుల మండల జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పలువురు పేర్లు వినిపించిన, ఏ అభ్యర్థికి బిఫాం రాక పోవడంతో పలువురు ఆశావాలు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల చిట్టచివరి రోజు అయిన శుక్రవారం వరకు అధిష్టానం నుంచి ఐసరం మహేశ్వరికి కి కూడా ఒక భరోసా లభించకపోవడంతో ఐసరం మహేశ్వరి ముందుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున జిమాడుగుల జడ్పిటిసిగా నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం సాయంత్రం వైకాపా అధిష్టానం దాదాపు ఐసరం మహేశ్వరి పేరు ఖరారు చేసినట్లు సమాచారం రాగా, సోమవారం పార్టీ అధిష్టానం మహేశ్వరి కి బీఫామ్ అందజేశారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కొట్టగుళ్ళు భాగ్యలక్ష్మి, జడ్పీ చైర్పర్సన్ జల్లెపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం, మాజీ ఎమ్మెల్యే శెట్టి పాల్గున పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# ఎన్నికల వేళ రెవెన్యూ, మరియు పోలీసు సిబ్బంది విస్తృత తనిఖీలు



**జి.మాడుగుల (మీ వార్త ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ, మరియు ,పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల వేళ వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ జి. ఈశ్వరరావు, ఎస్ చిన్న వెంకటరమణ , పోలీస్ సిబ్బంది కే రాజు, పి రాజు ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మండల కేంద్రం మీదుగా మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను ఆపి అవసరమైన పత్రాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా పెంచారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా ముందస్తు చర్యలు చేపడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, మరియు రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికలు ముగిసే వరకు తనిఖీలు కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నారు..

# 17వ వార్డులో తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన శ్రీ బెజవాడ నాగరాజు తో చర్చలు



**పెడన అక్టోబర్ 26(మీ వార్త ప్రతినిధి)** 17వ వార్డులో తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన శ్రీ బెజవాడ నాగరాజు తో మరియు వార్డు లోని ముఖ్యమైన నాయకులతో పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ , జిల్లా టీడీపీ అధ్యక్షులు శ్రీ వీరంకి గురుమూర్తి ప్రత్యేకంగా చర్చలు జరిపారు.నాయకుల సూచనల మేరకు సానుకూలంగా స్పందించిన శ్రీ నాగరాజు , తాను క్రమశిక్షణ కలిగిన టీడీపీ కార్యకర్తనని, పార్టీ అధిష్టానం నిర్ణయాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. వార్డులో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అధికారిక అభ్యర్థి గెలుపు కొరకు పూర్తిస్థాయిలో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

# ప్రజానాట్యమండలి తల్లాడ మండల అధ్యక్ష కార్యదర్శులుగా గండమల ఆనందరావు, మేడి భిక్షం






**తల్లాడ మీ వార్త విలేకరి.26.10.2026**
ప్రజా సమస్యలపై కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలి -- ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ తల్లాడ: తల్లాడలోని స్థానిక దొడ్డ కృష్ణయ్య భవనంలో ప్రజానాట్యమండలి తల్లాడ మండలం రెండవ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభ సూచకంగా ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు తాళ్లూరి రాములు ప్రజానాట్యమండలి జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలో ప్రజానాట్యమండలి తల్లాడ మండల నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గండమల ఆనందరావు, మేడి భిక్షం ఎన్నికయ్యారు.ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ మాట్లాడుతూ, ప్రజానాట్యమండలి నిత్యం ప్రజా సమస్యలను పాటలు, కళారూపాల ద్వారా ప్రజల గొంతుకగా వినిపిస్తూ, ప్రజలను చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రజానాట్యమండలి నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాల ద్వారా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతోందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వాలు కళాకారులకు అనేక ఆశలు చూపిస్తూ, తమ స్వార్థ ప్రయోజనాల కోసం వారిని ఉపయోగించుకుంటూ బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. చైతన్యవంతమైన ప్రజానాట్యమండలి కార్యకర్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ, వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నారని అన్నారు. ప్రజానాట్యమండలి కళ కోసం మాత్రమే కాకుండా ప్రజల కోసం, ప్రగతి కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం కళాకారుల సేవలను గుర్తించి, వారికి తగిన గుర్తింపుతో పాటు సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. సమాజంలో వేళ్లూనుకుంటున్న మూఢనమ్మకాలు, డ్రగ్స్ వినియోగం, అసాంఘిక కార్యకలాపాలకు వ్యతిరేకంగా కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను ప్రజానాట్యమండలి కళాకారులు రూపొందిస్తున్నారని తెలిపారు. సమాజంలోని అన్ని రుగ్మతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రజానాట్యమండలి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు కే. నరేంద్ర, సత్తుపల్లి డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సండే సత్యం, అయనంపూడి సనందరావు, ప్రజాతంత్ర బాధ్యులు అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, నల్లమోతు మోహన్ రావు, సత్తెనపల్లి నరేష్, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, మన్నేపల్లి శ్రీనివాసరావు, తేళ్లూరి లక్ష్మి, తాళ్లూరి రాములు, ముచ్చింతల ఎల్లారావు, కోదూరు రాములు, కాంపల్లి కృష్ణ, కాంపల్లె నాగేశ్వరరావు, ఉత్తమ సంజీవరావు, కాంపల్లి రాములు, సూర్య ప్రకాష్ రావు, ఇస్నాపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సాగిన వాసవి మాత రథోత్సవం





**ఏడు రాష్ట్రాలకు చెందిన 225 మంది కళాకారులతో కనుల విందుగా వెండి రథంపై ఊరేగిన వాసవి మాత**

**తాడేపల్లిగూడెం అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)**
తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయితన క్షేత్రంలో 59వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాల అనంతరం జరిగిన రథోత్సవ కార్యక్రమం నేడు అంగరంగ వైభవంగా జరిగింది. ఏడు రాష్ట్రాల నుండి వచ్చిన 225 మంది కళాకారులతో కనుల విందుగా వెండి రథంపై వాసవి మాత ఊరేగింపు జరిగింది. ఏడాదికి ఏడాదికి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా కళాకారులను తీసుకొని వచ్చి రంగ రంగ వైభవంగా ఈ కార్యక్రమంలో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. రథోత్సవ కమిటీ చైర్మన్ నారాయణ రాంబాబు మాట్లాడుతూ గడిచిన మూడు సంవత్సరాలుగా తాను రథోత్సవంలో కొత్తదనంతో కూడిన కళాకారులను తీసుకుని వచ్చి అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిపించామని తెలియజేశారు. ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాస్ రావు, గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, ముందుగా కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో రథోత్సవానికి ఒక ప్రత్యేకత ఉందని దానికి అనుగుణంగా ఆర్య వైశ్యులు, వాసవి క్లబ్, వనితా క్లబ్, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఐవిఎఫ్, పలు సంఘాల సభ్యులు సహాయ సహకారాలతో 5000 మందికి చక్కర పొంగలి, పులిహోర, శనగల ప్రసాదాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్ల రాము, కార్యదర్శి నున్న సుందరం, కోశాధికారి భోగవల్లి రమేష్, ఆలయ కార్యదర్శులు ఆలపాటి చిన్న ఆలపాటి సత్యనారాయణ మరియు కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో ఎంతో వైభవభ్రంగా నిర్వహించమని తెలియజేశారు. 108 కళాశాలతో మహిళలు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. 75 మంది మహిళలతో కోలాటం, కోయంబత్తూర్ నుంచి తీసుకొచ్చిన కృత్రిమ ఏనుగు, దశావతారాలలో అమ్మవారు. కేరళ వాయిద్యాలు, చిలక నృత్యాలు, ఈ కార్యక్రమంలో మరింత ఆకట్టుకున్నాయి. ప్రధాన పురవీధులలో ఈ రథోత్సవం రాత్రి 11 గంటల వరకు సాగింది. అమ్మవారి దేవాలయం నుండి రేలంగి చిత్రం వరకు వెళ్లి టూ టౌన్ జీవి మాల్ సెంటర్, ప్రధాన వీధులలో అమ్మవారి రథోత్సవ సాగింది. ప్రజల పెద్ద సంఖ్యలో రహదారులపై బారులు తీరారు. బాణాసంచా నడుమ సాగిన ఈ రథోత్సవం పోలీసుల పర్యవేక్షణలో ఆర్యవైశ్యుల సహాయ కమిటీ వారి సౌజన్యంతో ప్రశాంతంగా సాగింది.

# మానవవత స్వచంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఆర్థిక సహాయం




**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 26 ( మీ వార్త ప్రతినిధి ):**
కేతవరం గ్రామంలో మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు తన్నీరు రామకృష్ణ అధ్యక్షతన బేతా రమేష్ నిర్వహణలో ఈసీ మెంబర్ మాగంటి ముక్క రాజు సమక్షం లో చేయడం జరిగింది. మానవతా సంస్థ తరఫున 5000 మండల అధ్యక్షులు తన్నీరు రామకృష్ణ 1000 మొత్తం 6000 రూపాయలు వాసిరెడ్డి వెంకన్న ఆర్థిక సహాయం ందజేశారు.మరియు 50 సార్లు రక్తదానం చేసిన పెద్దమల్ల బాలు చిరు సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రోటరీ అధ్యక్షులు పసల వెంకట సుబ్బారావు, సెంట్రల్ కమిటీ కన్వీనర్ శ్రీమతి త్రిపుర రమేష్, కార్యవర్గ సభ్యులు కేదాసు శ్రీనివాసరావు, ఆత్మీయ సహకార కమిటీ అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ,నెంబర్ కన్నా లక్ష్మణరావు, కొండ్రెడ్డి సోమరాజు, మానవత సభ్యులు రామిశెట్టి శ్రీనివాసరావు, మద్ది డైరెక్టర్ ధూళిపాళ్ల ప్రభాకర్, పులి శివ, గ్యాలం కృష్ణ, ఆదిలక్ష్మిణస్వామి, ఆనం వెంకట శ్రీనివాస్, చేతి శ్రీను, గోకా యేసు, గోకా రామకృష్ణ వరద బుచ్చిరాజు, పోల్నాటి గంగరాజు, కవులూరి కాత్రాజు, బోనగిరి వెంకటరమణ, తలారి వెంకట్, నల్లమోని విష్ణు, ఆది నాగు తలారి తేజ, రాజనాల రామకృష్ణ, చేతి సుబ్బారావు ఎర్రమళ్ళ మణికంఠ,చేతి విజ్జు చంద్రు దుర్గారావు, మాజీ ఎంపీటీసీ పెద్దమల్ల మోహన్ ధర్మేంద్ర, గరికపాటి నాగ మునీశ్వరరావు,వరద వెంకీ మరియు మానవత సభ్యులు పాల్గొన్నారు.

## కొంగంచర్ల పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఉప్పాల హారిక

ఎన్నికల ప్రచారం..



**పెడన అక్టోబర్ 26(మీ వార్త ప్రతినిధి)** పెడన మండలం, చేవేంద్ర సెగ్మెంట్ పరిధిలోని కొంగచర్ల పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శ్రీమతి ఉప్పాల హారిక ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు..ఈ ప్రచార కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి శ్రీమతి రాజులపాటి వాణి గారు, చేవేంద్ర సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమతి గరికపాటి చారుమతి పాల్గొని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు కూడా ప్రచారంలో పాల్గొని పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు...

## మచిలీపట్నం 20వ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచారం

కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం అక్టోబర్ 26(మీ వార్త ప్రతినిధి)** మచిలీపట్నం నగరంలో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ 20వ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మేయర్ అభ్యర్థి శ్రీమతి అబ్దుల్ అబీదా గారి విజయాన్ని కాంక్షిస్తూ, 20వ డివిజన్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి శ్రీమతి లోగిశెట్టి భార్గవి విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో లోగిశెట్టి వెంకటస్వామి గారితో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొని ప్రజలను కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇరువురు అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు.

## ఘనంగా దగ్గుల శ్రీకర్ రెడ్డి 2వ జన్మదిన వేడుకలు..

**తల్లాడ మీ వార్త విలేఖరి.26.10.2026**





నిరుపేదలకు స్వీట్స్, స్టీల్ డబ్బాలు పంపిణీ.. తల్లాడ పట్టణానికి చెందిన మాజీ వీడీసీ చైర్మన్ దగ్గుల శ్రీనివాస రెడ్డి, లలిత కుమారి దంపతుల మనవడు, పుల్లారెడ్డి, సౌమ్యరెడ్డి దంపతుల కుమారుడు శ్రీకర్ రెడ్డి 2వ జన్మదిన వేడుకలను సోమవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు, వాటర్ బాటిల్ పంపిణీ చేశారు. అదేవిధంగా ఏనుకూరు మండలంలోని కొత్త మేడిపల్లి గ్రామంలో ఆదివాసీల కోయ కుటుంబాలకు స్వీట్లతో పాటు ఐదు లీటర్లు విలువ చేసే స్టీల్ క్యాన్ డబ్బాలు పంపిణీ చేశారు. సుమారు 60 కుటుంబాలకు వీటిని అందించారు. ఈ సందర్భంగా శ్రీకర్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దగ్గుల కుటుంబ సభ్యులు దగ్గుల నర్సిరెడ్డి, అప్పిరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస రెడ్డి దంపతులు, దామోదర్ రెడ్డి, చిన్నారులు పాల్గొన్నారు.

## సొలబం కొత్తూరులో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

**జి.మాడుగుల (మీ వార్త ప్రతినిధి) అల్లూరి సీతారామరాజు జిల్లా**







జి.మాడుగుల మండలం సొలబం పంచాయతీ పరిధిలోని సొలబం కొత్తూరు గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (సి ఏ ఎస్ ఓ) నిర్వహించారు. జి.మాడుగుల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సాయిరాం పడాల్ ఆధ్వర్యంలో. సి ఏ పి. పార్టీ సిబ్బందితో కలిసి గ్రామంలోని ఇళ్లను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామస్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ త్రిశూల్ లక్ష్యాలు, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

# జనంలోనే జననేత... ప్రజల మధ్య ప్రజాసేవకుడు.... ఎమ్మెల్యే రోషన్ కుమార్

**చింతలపూడి, అక్టోబర్ 26 ( మీ వార్త ప్రతినిధి ):** శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ తన క్యాంపు కార్యాలయం నుంచి జంగారెడ్డిగూడెంలో జరగనున్న మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి, కౌన్సిలర్ల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరారు.
ఈ క్రమంలో మార్గమధ్యంలో రోడ్డు పక్కన తేగలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఓ ఆడపడుచును చూసి తన వాహనాన్ని ఆపి, ఆమె వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, తేగలను కొనుగోలు చేశారు.
తన పక్కనే సామాన్యుడిలా వచ్చి కూర్చుని ఆప్యాయంగా పలకరించిన వ్యక్తి గౌరవ శాసనసభ్యులు అని తెలుసుకున్న ఆ మహిళ ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు గురైంది. హోదా పెరిగినా... మనసు మారని నాయకత్వం!
అధికారం ఉన్నా... సామాన్యులకు అందుబాటులో ఉండే మనస్తత్వం
ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే శ్రీ సొంగా రోషన్ కుమార్ గారి నిరాడంబరతకు ఈ సంఘటన ఒక చక్కని నిదర్శనమన్నారు.



# పట్టణంలో కూటమి ప్రచార జోరు -

అభ్యర్థుల తో కలిసి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఎన్నికల ప్రసారం

**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 26: ( మీ వార్త ప్రతినిధి ):** జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఎన్నికల వేళ పట్టణంలో కూటమి ప్రచారం జోరందుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థితో పాటు 32 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పట్టణంలో ఎన్నికల ప్రచారం లో విస్తృతంగా పర్యటించారు.
అంబికా హోటల్ నుండి ప్రారంభమైన ర్యాలీ మసీదు సెంటర్, భగత్ సింగ్ సెంటర్, చింతల బజార్, సిటీ కేబుల్ సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్, గంగానమ్మ గుడి సెంటర్ మీదుగా తిరిగి మసీదు సెంటర్ వరకు సాగింది. దారి పొడవునా స్థానిక ప్రజలు, వ్యాపారులు, మహిళలు ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ పట్టణ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని, ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతుందని



పెండింగ్ సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి బలపరిచిన చైర్ పర్సన్ అభ్యర్థిని, 32 వార్డుల కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి మున్సిపాలిటీలో కూటమి జెండా ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.
ఈ ప్రచార కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల పరిశీలికులు రావి వెంకటేశ్వరావు,రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు, చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మేక ఈశ్వరయ్య తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహర్షి వాల్మీకి జయంతి ,జీవితం సనాతన ధర్మ గొప్పతనానికి ప్రతీక

విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

**మచిలీపట్నం అక్టోబర్ 26(మీ వార్త ప్రతినిధి)** కూనపురెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌లో వాల్మీకి జయంతి వేడుకలు విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా ఆధ్వర్య సహకారంతో సోమవారం, 2026 అక్టోబర్ 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు కూనపురెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి వాల్మీకి జీవితం, ఆయన ఆధ్యాత్మిక పరివర్తన, రామాయణ మహాకావ్యం ద్వారా సమాజానికి అందించిన ధార్మిక, నైతిక సందేశాలను స్మరించుకున్నారు.
ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యదర్శి వర్రె రాజశేఖర్, జిల్లా కార్యాలయ ప్రముఖ్ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ కూనపురెడ్డి శ్రీనివాసరావు, శ్రీ ధూళిపాళ రాము, శ్రీ హరికృష్ణ పాల్గొన్నారు. మహర్షి వాల్మీకి ఆదర్శాలను స్మరించుకుంటూ, ఆయన జీవితం నేటి సమాజానికి అందించే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు.

**జన్మం కాదు.. జ్ఞానం, సాధన, సత్పరివర్తనే వ్యక్తి ఔన్నత్యానికి ప్రమాణాలు**

ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు డా. బూరగడ్డ శ్రీనాథ్ , మహర్షి వాల్మీకి జీవితం సనాతన ధర్మంలోని విశాల దృక్పథానికి, వ్యక్తిలో పరివర్తన సాధ్యమనే గొప్ప సందేశానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.
సంప్రదాయ కథనాల ప్రకారం, వాల్మీకి జీవితం సాధారణ స్థితి నుంచి ఆధ్యాత్మిక సాధన, తపస్సు, జ్ఞానం ద్వారా మహర్షి స్థాయికి ఎదిగిన పరివర్తనకు నిదర్శనంగా నిలుస్తుందని వివరించారు. ఒక వ్యక్తి గతం లేదా జన్మ నేపథ్యం మాత్రమే అతని ఔన్నత్యాన్ని నిర్ణయించవని, అతని ఆలోచనలు, సాధన, జ్ఞానం,




సత్ప్రవర్తన, సమాజానికి అందించే సేవే అతని నిజమైన గొప్పతనాన్ని నిర్ధారిస్తాయని తెలిపారు.
సనాతన ధర్మం వ్యక్తి పరివర్తనకు, జ్ఞాన సాధనకు, నైతిక ఉన్నతికి ప్రాధాన్యతనిస్తుందని, మహర్షి వాల్మీకి జీవితం ఈ విలువలను తరతరాలకు చాటిచెబుతోందని అన్నారు. ఒక వ్యక్తి తన జీవితంలో మార్పును సాధించి, తన జ్ఞానం మరియు సృజనాత్మకతతో సమాజానికి మార్గదర్శకుడిగా ఎదగగలడనే స్ఫూర్తిని ఆయన జీవితం అందిస్తుందని పేర్కొన్నారు.

**రామాయణం -- ధర్మం, కర్తవ్యం, మానవీయ విలువల మహాకావ్యం**

మహర్షి వాల్మీకి రచించిన రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదని, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, త్యాగం, కుటుంబ విలువలు, మానవ సంబంధాలు, ప్రజాపాలనలో నైతికత వంటి అనేక జీవన సూత్రాలను అందించే మహాకావ్యమని తెలిపారు. ఈ విలువలను నేటి తరానికి పరిచయం చేయడం ద్వారా సమాజంలో బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని, నైతిక ప్రవర్తనను పెంపొందించవచ్చని పేర్కొన్నారు.సామాజిక సమరసతే సమైక్య సమాజానికి పునాది,మహర్షి వాల్మీకి జయంతి వంటి కార్యక్రమాలు మహనీయుల జీవితాలను స్మరించుకోవడంతో పాటు, సమాజంలో పరస్పర గౌరవం, సామాజిక సమరసత, ఐక్యతను బలోపేతం చేయడానికి దోహదపడాలని అన్నారు. ప్రతి వ్యక్తికి గౌరవం, ప్రతి సమాజ వర్గానికి సముచిత గుర్తింపు, పరస్పర సహకారం, సేవాభావం వంటి విలువలను ఆచరణలో పెట్టినప్పుడే సమైక్యమైన, శాంతియుతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.మహర్షి వాల్మీకి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ధార్మిక చైతన్యం, సామాజిక సమరసత, దేశభక్తి, సేవాభావాన్ని ప్రజల్లో విస్తరించేందుకు విశ్వ హిందూ పరిషత్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

# ప్రశాంత ఎన్నికల కోసం ఫ్లాగ్ మార్చ్ .

సిఐ బి. యాదగిరి .

**జీలుగుమిల్లి, (మీ వార్త ప్రతినిధి)** మండలంలోని జీలుగుమిల్లి దర్భ గూడెం గ్రామాల్లో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు అధికారులు, జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బంది ఈ ఫ్లాగ్ మార్చ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించి, ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించారు. ఎన్నికల సమయంలో



శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని సర్కిల్ ఇన్స్పెక్టర్ బి యాదగిరి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్, బుట్టాయిగూడెం ఎస్ఐ చెన్నారావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## జెడ్పీటీసీ అభ్యర్థిగా ఐసారం మహేశ్వరికి బీ-ఫామ్ అందజేత..



**జి.మాడుగుల(మీ వార్త ప్రతినిధి)** అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం జెడ్పీటీసి అభ్యర్థిగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఐసారం మహేశ్వరిని అధికారికంగా ఖరారు చేశారు. స్థానిక వైయస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే మరియు వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు చేతుల మీదుగా ఆమెకు బీ-ఫామ్ అందజేశారు. ?ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అభ్యర్థికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ అభ్యర్థి ఐసారం మహేశ్వరి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన పార్టీ అధిష్టానానికి, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలకు కట్టుబడి, స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం సైనికులా పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.
?ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక వైయస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాగంటి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన తాడేపల్లిగూడెం శాసన సభ్యులు మరియు జనసేన పార్టీ చీఫ్ విప్ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రదేశం: ఏలూరు (మాగంటి నిలయం)



బొలిశెట్టి శ్రీనివాస్ ఈరోజు సాయంత్రం 5:00 గంటలకు ఏలూరులోని 'మాగంటి నిలయం' స్వగృహంలో మాజీ మంత్రివర్యులు మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) మాగంటి పద్మవల్లీ దేవి దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కామవరపుకోట జెడ్పీటీసీగా కూటమి అభ్యర్థిని శ్రీమతి పద్మవల్లీ దేవి గారు భారీ మెజారిటీతో విజయం సాధించి ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పీఠాన్ని అధిష్టించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.జనసేన పార్టీ కి చెందిన ఎంఎల్ఏ అయినప్పటికినీ మంచికుటుంబంగా వివాదాలకు అతీతంగా ఉండే మాగంటి బాబు దంపతులకు అభినందనలు తెలపాలని వచ్చినట్లు ఆయన తెలిపారు

## సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో సత్యదీక్షపై ప్రచారం.

పత్తిపాడు నియోజకవర్గం.





**ఏలేశ్వరం; అక్టోబర్ 26(మీ వార్త ప్రతినిధి)** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సత్యదీక్షపై భక్తులకు అవగాహన కల్పిస్తూ, సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేస్తున్నారు. దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధర్, చైర్మన్ ఐ.వి. రోహిత్ ఆదేశాల మేరకు ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నవంబర్ 4వ తేదీ బుధవారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు 27 రోజులపాటు సత్యదీక్ష కొనసాగనుంది. భక్తులు 27 రోజులు, 18 రోజులు లేదా 9 రోజులపాటు దీక్షను ఆచరించవచ్చని నల్లమిల్లి కృష్ణబాబు వివరించారు. స్వామివారి స్థలపురాణం ప్రకారం, ఒకరోజు సత్యనారాయణ స్వామివారి వ్రతం ఆచరించడం కంటే 27 రోజుల సత్యదీక్ష ఆచరించడం ద్వారా వెయ్యి రెట్లు అధిక ఫలితం లభిస్తుందని భక్తులకు వివరించారు. సత్యదీక్ష నియమాలు, ఆచరించాల్సిన విధానాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే నవంబర్ 24న నిర్వహించనున్న స్వామివారి గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం గురించి ప్రత్తిపాడు, ధర్మవరం ప్రాంతాలతోపాటు పరిసర గ్రామాల భక్తులకు వివరించి, కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు సింగిలిదేవి సత్తిరాజు, సిద్ధ అప్పలరాజు, పోకనాటి వెంకటేశ్వరరావు, కె సురేష్, దోనె అచ్యుతరామయ్య, వీరలక్ష్మి, ఉమాలలితదేవి, పావని, గన్ని కమలతోపాటు పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

## అనంతగిరి మండల కేంద్రంలో వైసిపి ఎంపీటీసీ అభ్యర్థులకు బీఫామ్‌ల అందజేత.

**అనంతగిరి,అక్టోబర్ 26 ( మీ వార్త )** అనంతగిరి మండలంలో జరగనున్న పరిషత్ ఎన్నికలకు సంబంధించి రాజకీయ వాతావరణం వేడెక్కింది.ఇందులో భాగంగా సోమవారం అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో 14 మంది ఎంపీటీసీ అభ్యర్థులకు అధికారికంగా బీఫామ్‌లను



అందజేసే కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ప్రభాకర్ రావు,రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు రేగం చాణిక్య ముఖ్య అతిథిగా విచ్చేసి,అభ్యర్థులకు బీఫామ్‌లను అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ,అభ్యర్థులందరూ ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని,ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని పిలుపునిచ్చారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజల ముందుకు వెళ్లాలని, మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.బీఫామ్‌లు అందుకున్న అభ్యర్థులలో సేంబి కౌసల్య మాట్లాడుతూ,తమపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ,మండల సర్వతోముఖాభివృద్ధికి,ప్రజల సంక్షేమానికి నిరంతరం పాటుపడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాజరాజేశ్వరిఅమ్మవారి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కంబాల





అమ్మవారిశరన్నవరాత్రి మహోత్సవాలకు లక్ష రూపాయలు, అన్న సమారాధనకు టన్ను బియ్యం విరాళం.

**కోరుకొండ అక్టోబర్ 26( మీ వార్త ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లాకోరుకొండ మండలం కాపవరం శ్రీరాజరాజేశ్వరిఅమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని, ఆలయంవద్దసోమవారం నిర్వహించిన, భారీఅన్నసమారాధనకార్యక్రమంలోవిశ్వహిందూధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గంబీఎల్‌ఏ-1కంబాలశ్రీనివాసరావుముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పూర్ణ కలశంతో పూలవర్షం కురిపిస్తూ, తీన్మార్ డప్పులతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలోఅమ్మవారిని దర్శించుకుని, పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కంబాల శ్రీనివాసరావుని శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగాసత్కరించారు. అర్చకులువేదమంత్రాలతోఆశీర్వదించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, భక్తులకు వడ్డించారు. అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలకుగాను కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు నగదు, అన్న సమారాధన కార్యక్రమానికి టన్ను బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావుమాట్లాడుతూనరేంద్రమోడీస్ఫూర్తితోరాజకీయాల్లోకి అడుగుపెట్టి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా మూడు నియోజక వర్గాల్లో170మండపాలకు విరాళాలు ఇవ్వడంజరిగిందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు,ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంలో దేవాలయాలు కీలక పాత్రపోషిస్తున్నాయన్నారు. దసరా, శరన్నవరాత్రిఉత్సవాలను ప్రతి గ్రామంలో భక్తిశ్రద్ధలతో, ఎంతో వైభవంగానిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంసుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తి, సేవాభావంతోనిర్వహించేకార్యక్రమాలకు తన వంతుసహకారం ఎల్లప్పుడూఉంటుందనితెలిపారు. ఈకార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీసభ్యులు,గ్రామపెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాల అభ్యర్థుల అర్హతల ధృవీకరణ పటిష్ఠం చేయాలి -- వి హెచ్ పి

వినతిపత్రంలోని అంశాల తీవ్రతను డి ఆర్ ఓ కు వివరించిన వి హెచ్ పి ప్రతినిధి బృందం




**మచిలీపట్నం, అక్టోబర్ 26,(మీ వార్త ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతల ధృవీకరణ ప్రక్రియను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా రూపొందించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా సమర్పించిన వినతిపత్రంపై తక్షణ చర్యలు తీసుకోవాలని వి హెచ్ పి ప్రతినిధి బృందం ఈరోజు కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి (డి ఆర్ ఓ)ను కలిసి విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతినిధి బృందంలో వి హెచ్ పి కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి శ్రీ వర్రె రాజశేఖర్ పాల్గొన్నారు. ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతల ధృవీకరణలో పారదర్శకత, విశ్వసనీయతకు ఉన్న ప్రాధాన్యతను, ఈ అంశంలోని తీవ్రతను ఐ=ూ గారికి వివరించారు. వినతిపత్రాన్ని అత్యవసరంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. ఈ అంశంపై వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ సమర్పించిన వినతిపత్రం జి ఓ వి ఏ పి/ఈ/2026/0007747తేదీ 25-10-2026 ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపబడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతలను నిబంధనలకు అనుగుణంగా ధృవీకరించేందుకు మరింత పటిష్ఠమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరాన్ని ఈ వినతిపత్రం ప్రధానంగా ప్రస్తావించింది. రిజర్వేషన్ల ద్వారా రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అర్హులైన వర్గాలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం వంటి లక్ష్యాలు సక్రమంగా నెరవేరేలా తగిన మార్గదర్శకాలు, పర్యవేక్షణ చర్యలను పరిశీలించాలని కోరింది. ఈ నేపథ్యంలో, వినతిపత్రంలోని అంశాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, దానిని అత్యవసరంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించి తగిన పరిశీలనకు అవకాశం కల్పించాలని వి హెచ్ పి ప్రతినిధి బృందం డి ఆర్ ఓ ను కోరింది. నామినేషన్ సమయంలో నిర్దేశిత అఫిడవిట్లు సమర్పించడం, కుల ధృవపత్రాల ప్రామాణికతను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించడం, విశ్వసనీయమైన ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ జరపడం వంటి రక్షణ చర్యలను అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని వినతిపత్రంలో కోరారు. తప్పుడు సమాచారం లేదా నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లు నిర్ధారణ అయిన సందర్భాల్లో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ప్రతి అభ్యర్థి హక్కులు, సహజ న్యాయ సూత్రాలు పరిరక్షించబడాలని వి హెచ్ పి స్పష్టం చేసింది. రిజర్వేషన్లు అర్హులైన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన ప్రాతినిధ్య అవకాశాలను సార్థకం చేయడానికి ఉద్దేశించినవని, వాటి ప్రయోజనాలు లక్షిత వర్గాలకు న్యాయబద్ధంగా అందేలా పారదర్శకమైన ధృవీకరణ వ్యవస్థ అవసరమని వి హెచ్ పి పేర్కొంది. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ల లక్ష్యాలను పరిరక్షించడానికి దోహదపడతాయని అభిప్రాయపడింది. విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

# గొల్లపల్లి డేవిడ్ రాజు మనవడి మొదటి పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిర్ల, డాక్టర్ చల్లా.





**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, అక్టోబర్, 26** అముడా (అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ప్రిస్కిల్లా దంపతుల ముద్దుల మనవడు, స్వరూప్ రాజ్, లీలా జానకి కపుల్స్ కుమారుడు బేబీ డేవిడ్ రాజ్ (ప్రిన్స్) మొదటి పుట్టినరోజు వేడుకలు శనివారం కొత్తపేటలోని శ్రీకరం--శుభకరం ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు హాజరై చిన్నారి డేవిడ్ రాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి దీవించారు. ప్రముఖుల రాక, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సందడితో పుట్టినరోజు వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు,ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, శాసనమండలి మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి నాగిరెడ్డి, కొత్తపేట మాజీ ఎంపీపీ మార్గాని గంగాధరం, ఆవిడి మాజీ సర్పంచ్ చంటి, నెక్కంటి బుజ్జి, ఎలుగుబంట్ల బూరయ్య, శ్రీపతి వీర్రాజు, వెత్సా శ్రీనివాస్, ఎరుకొండ గణేష్, లంకే వెంకటరెడ్డి, నార్గని వీరబాబు, నార్గని సెంథిల్ కుమార్, పాకా శ్రీను (పాస్టర్), పాకా దుర్గాప్రసాద్ తదితరులు హాజరై చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.

## బోడపాడులో కూటమి నేతల జోరు ప్రచారం



**పెంటపాడు అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి )** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా త్వరలో జరగబోయే జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు సోమవారం బోడపాడులో ముమ్మర ప్రచారం చేపట్టారు. అభ్యర్థిని లక్ష్మి వెంకట భవాని ఇంటింటా ప్రచారం నిర్వహించి తన చేతులు జోడించి ఎంపిటీసీ గా తనకు, జడ్పీటీసీ గా తనబుద్ధి రవి కిరణ్ కు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. బోడపాడులో కూటమి నాయకుడు మట్టా సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జి, బిజెపి రాష్ట్ర నాయకులు ఈతకోట తాతాజీ బలపరిచిన ఆకుతీగపాడు ఎంపీటీసీ (జనసేన) కూటమి అభ్యర్థిని కిలపర్తి లక్ష్మి వెంకట భవాని కి, జడ్పీటీసీ అభ్యర్థి తనబుద్ధి రవి కిరణ్ కు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి వారిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. బోడపాడు, ఆకుతీగపాడు గ్రామాల అభివృద్ధిలో ఎమ్మెల్యే కృషి మరువలేనిదన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. ఎమ్మెల్యే బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల వెంకట్రావు, బుద్ధన ధనరాజు, కొండపల్లి శ్రీను, రాంబరికెల బాల మురళీ కృష్ణ, చిలుకూరి శ్రీను, దాసం వెంకటేశ్వర్లు, ఆకుల నాని, మొఖమాట్ల సూరిబాబు, పడాల ఉమా శంఖర్, కొల్లూరి నాగరాజు, బుద్ధన అప్పారావు, వంకా రామకృష్ణ, తిరుపతి సురేష్,తిరుపతి శ్రీనివాస్, మొఖామట్ల సాయి,దాసం నరసయ్య, మొఖమాట్ల అరుణ్ కుమార్, ఇర్లపాటి గోపి, తదితరులు పాల్గొన్నారు.

## డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారం



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** గోవా రాష్ట్రంలోని పనాజీ నగరంలో నిర్వహించిన 9వ ఆసియన్ పీజీపీఆర్ అంతర్జాతీయ సదస్సులో డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సొంతం చేసుకుంది. వ్యవసాయ రంగానికి చెందిన ఉద్యాన శాస్త్ర విభాగానికి మరియు ఆసియన్ పీజీపీఆర్ సొసైటీకి అందించిన విశేషమైన పరిపాలనా నాయకత్వం, సంస్థాగత మద్దతుకు గుర్తింపుగా ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె. ధనంజయ రావుకు విశిష్ట పరిపాలన, నాయకత్వ అవార్డును ప్రదానం చేశారు. అక్టోబర్ 23 నుండి 25 వరకు కొనసాగిన ఈ సదస్సులో ఆసియన్ పీజీపీఆర్ సొసైటీ వ్యవస్థాపకులు, చైర్మన్ ప్రొఫెసర్ ఎంఎస్. రెడ్డితో పాటు పలువురు అంతర్జాతీయ ప్రతినిధుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. విశ్వవిద్యాలయానికి ఇటువంటి అంతర్జాతీయ స్థాయి గౌరవం లభించడం పట్ల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

## బుట్టాయిగూడెం శివాలయంలో ఘనంగా అన్నప్రసాద వితరణ

సోమవారం సందర్భంగా భక్తులకు అన్నప్రసాద సేవ

అన్నప్రసాద వితరణకు సహకరించిన రాజమండ్రికి చెందిన ఎం. సత్యనారాయణ



**ఎటపాక, అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి):** పవిత్ర సోమవారం సందర్భంగా ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని శ్రీ శివాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజమండ్రికి చెందిన ఎం. సత్యనారాయణ అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సహకరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు, దాతల సహకారంతో ప్రతి సోమవారం ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆధ్యాత్మిక సేవాభావంతో కార్యక్రమానికి సహకరించిన ఎం. సత్యనారాయణను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# తుపాన్ దృష్ట్యా కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**వేలేరుపాడు అక్టోబర్ 26 (మి వార్తా ప్రతినిధి)** తహశీల్దార్ వేలేరుపాడు నేటి నుండి అక్టోబర్ 29 వరకు గల ఆర్నబ్ తుఫాన్ కారణంగా భారీ ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాల పై ప్రజలకు హెచ్చరిక -- అప్రమత్తంగా ఉండండి. ఆర్నబ్ తుఫాను వల్ల భారీ ఈదురు గాలులతో (గంటకు 90 నుండి 120 కిలోమీటర్ల వేగంతో) కూడిన వర్షాలు ఉన్న కారణంగా గోదావరి నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నామని తాసిల్దార్ తెలిపారు. గోదావరి నది ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు మరియు వృద్ధుల విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వర్షపు నీటితో మునిగిపోయిన రహదారులు, వంతెనలు, కల్వర్టులు, వాగులు మరియు ఇతర జలమార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని మరియు జాలరులు చేపల వేటకు నది లోనికి వెళ్ళరాదన్నారు. ఎండిపోయిన పెద్ద పెద్ద చెట్లను, పాత భవనాలను ఆశ్రయించకూడదని తడిసి ఉన్న కరెంటు స్తంభాలను తాకకూడదదని ఎవరైనా తాత్కాలిక ఇళ్లల్లో నివశిస్తున్న



వారు, సురక్షిత ప్రాంతాలకు మరియు కొబ్బరి చెట్లు ఉన్న ఇళ్లు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే సంబంధిత మండల తహసీల్దార్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి. తహశీల్దార్ వేలేరుపాడు మండలం కంట్రోల్ రూమ్ నెంబర్ 9014102968 గమనిక: సదరు విషయములో ప్రజలను అప్రమత్తత చేసే విషయంతో బాటు భారీ వర్షాలకు ప్రభావితమయ్యే సమయానికి ముందే సంబంధిత మండల శాఖాధికారులు పైన తెలియజేసిన విషయములలో తగు చర్యలు చేపట్టవలసిందిగా తెలియజేసారు.

# జి.మాడుగుల మండలంలో పోలింగ్ కేంద్రాల తనిఖీ





**జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి)** అల్లూరి సీతారామరాజు జిల్లా రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల పరిశీలకులు శ్రీ రోణంకి కుర్మనాథ్, ఐఏఎస్ సోమవారం పరిశీలించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు.

ఎన్నికల విధులపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం జి.మాడుగుల మండలంలో పోలింగ్ కేంద్రాల తనిఖీ నిర్వహించిన రోనంకి కూర్మం నాథ్ ఐ ఏ ఎస్ జి.మాడుగుల మండలం వంజరి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం నంబర్ 23ను, రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు 24, 25ను పరిశీలించారు. అలాగే స్వర్ణ గ్రామం-1లోని పోలింగ్ కేంద్రం నంబర్ 26ను, పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం నంబర్ 27ను తనిఖీ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల విధుల నిర్వహణకు అనువైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల మార్పుపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలి వంజరి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రతిపాదనలను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు.

పోలింగ్ కేంద్రాల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తెలియజేయాలని స్పష్టం చేశారు.

వంజరి గ్రామ పంచాయతీ పరిధిలోని 45 గ్రామాల ప్రజలకు పోలింగ్ కేంద్రాల మార్పు వివరాలను దండోరా ద్వారా విస్తృతంగా తెలియజేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీ రాజకుమార్‌ను ఆదేశించారు.

ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాల వివరాలను ముందుగానే తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా చూడాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించి, పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియకు కృషి చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు సూచించారు.

# కూటమి అభ్యర్థులకు మద్దత్తు గా మంత్రి వాసంశెట్టి సుభాష్ విస్తృత ప్రచారం

### రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం.. సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు కూటమి అభ్యర్థులను గెలిపించండి





**రామచంద్రపురం, అక్టోబర్ 26: ( మీ వార్త ప్రతినిధి ):** రామచంద్రపురం పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పట్టణంలోని 9, 24వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు 9వ వార్డు అభ్యర్థి చిక్కం రామ శ్రీనివాసరావు, 24వ వార్డు అభ్యర్థి కొండపల్లి విశ్వతేజకు మద్దతుగా ప్రజలను కలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పట్టణ ప్రగతి, ప్రజా సంక్షేమం కొనసాగేందుకు కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

**ఆర్థిక ఇబ్బందుల నుంచి అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం -మంత్రి సుభాష్**

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకురావడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు, రహదారుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి స్పష్టం చేశారు.

**గత వైసీపీ పాలనలో అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైంది- మంత్రి విమర్శ**

గత వైసీపీ ప్రభుత్వ పాలనపై మంత్రి సుభాష్ విమర్శలు గుప్పించారు. అభివృద్ధి కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా రాష్ట్రాన్ని పలు రంగాల్లో వెనక్కి నెట్టారని ఆరోపించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, కీలక ప్రాజెక్టులు ఎంతో అవసరమని, వాటిని వేగవంతం చేయడం ద్వారానే భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు.

**మంత్రి సుభాష్ అభివృద్ధి పనులను గమనించి ఓటు ఇవ్వండి - మేడిశెట్టి శేషారావు**

మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి మేడిశెట్టి శేషారావు మాట్లాడుతూ.. రామచంద్రపురం నియోజకవర్గంతో పాటు పట్టణంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజారోగ్యానికి సంబంధించిన కార్యక్రమాల అమలులో మంత్రి చేస్తున్న కృషిని పరిశీలించి ఓటు వెయ్యాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా కొనసాగించేందుకు స్థానిక సంస్థల్లో ప్రజల సమస్యలపై అవగాహన కలిగిన ప్రతినిధులు అవసరమని పేర్కొన్నారు. చైర్మన్ అభ్యర్థిగా తనకు, 9వ వార్డు అభ్యర్థి చిక్కం రామ శ్రీనివాసరావుకు, 24వ వార్డు అభ్యర్థి కొండపల్లి విశ్వతేజకు ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. 9, 24వ వార్డుల్లో సాగిన ప్రచారంలో మంత్రి సుభాష్, మేడిశెట్టి శేషారావు, ఇతర కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు నారపు రెడ్డి బలరాం, కంచుమర్తి బాబురావు, గణేష్ శర్మ, పోలిశెట్టి శ్రీనివాస్, కొండ్రెడ్డి శ్రీనివాసరావు, తాళాబత్తుల మురళి, బ్రహ్మం, వైట్ల ప్రకాష్, దత్తు తదితరులతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కామవరపుకోట జెడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా మాగంటి పద్మావతి దేవి



**ఏలూరు అక్టోబర్ 26 ( మీ వార్త ప్రతినిధి)** కామవరపుకోట జెడ్పీటీసీ అభ్యర్థిగా, ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి పద్మావతి దేవిని ఏలూరులోని ఆమె నివాసంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా త్వరలో జరగబోయే జిల్లా పరిషత్ ఎన్నికలలో చైర్మన్ గా విజయం సాధించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి ఆకాంక్షించారు. ఆమె భర్త మాగంటి బాబు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తెలియని వారంటూ లేరని, ఆయన చరిష్మాతో తప్పకుండా సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థిని రాజ్యలక్ష్మి మద్దత్తు గా ఎన్నకల ప్రచారం లో పాల్గొన్న నేతలు



**ముమ్మిడివరం, అక్టోబర్ 26 (మీ వార్త విలేఖరి ):** లక్ష్మీవాడ గ్రామంలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థి చీకరుమిల్లి రాజ్యలక్ష్మి కి మద్దతుగా దాట్ల పవన్,నాగిడి నాగేశ్వరావు నడింపల్లి సుబ్బరాజు గ్రామ కమిటీ అధ్యక్షులు మాగాపు లచ్చిబాబు ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు. ఇంటి ఇంటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్దించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో మారిశెట్టి వెంకటేశ్వరరావు, పినిపే విజయ్ ప్రకాష్, చికురుమెల్లి భీమారావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, కాండ్రెగుల వెంకట్రావు, గెద్దాడ సత్యనారాయణ, రంకి రెడ్డి నాగబాబు, ఎలిపే ఈశ్వరరావు, రంకిరెడ్డి కృష్ణ,కాండ్రేగుల సత్యప్రసాద్ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ జడ్పిటిసి అభ్యర్థి చిన్నమ్మ ప్రచారహోరు..



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి సబ్బితి చిన్నమ్మ ఆదివారం సుడిగాలి ప్రచారం చేశారు. మండలంలోని అప్పారావుపేట, ఆరుగొలను, కడియద్ద, పుల్లాయిగూడెం, కొమ్ముగూడెం, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాలలో గల చర్చిలలో జరిగిన ప్రార్థనలో ఆమె పాల్గొన్నారు. పాస్టర్ లచే ప్రార్ధనలు చేయించుకుని, యేసు క్రీస్తు ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఇంటింటికి ప్రచారం నిర్వహించి తన గెలుపు కోసం అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సహకరించాలని ప్రజలను కోరారు. వైసిపి అధినేత జగనన్న, నియోజకవర్గం ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు అన్న తాను మహిళ అయినప్పటికీ,విద్యావేత్త ఐన తనకు జడ్పిటిసి అభ్యర్థిగా వైసీపీ బీఫామ్ ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలోను కూటమిగా, ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా తలపడుతున్నాయన్నారు. కానీ సింహం సింగిల్ గా వస్తుందన్నట్లు తాము అప్పుడు, ఇప్పుడు ఒంటరిగానే పోటీ చేస్తున్నామని, మహిళనైన తనకు ప్రజల ఆశీర్వాదం కావాలని ఆమె ప్రజలను అభ్యర్థించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే విద్యావేత్తలు రాజకీయాలలో రాణించాలని ఆమె ప్రజలకు వివరించారు. తనకు అవకాశం కల్పిస్తే మండల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దండగర్ర మమత స్కూల్ కరస్పాండెంట్ సబ్బితి బ్రహ్మయ్య, ఆయా గ్రామాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు నాయకులు పాల్గొన్నారు.

## పడమర విప్పర్రులో వైఎస్సార్సీపీ ఎన్నికల ప్రచారం



**పెంటపాడు అక్టోబర్ 26 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం వెస్ట్ విప్పర్రు గ్రామంలో ఎంపీటీసీ అభ్యర్థి చినిమిల్లి వెంకయ్య తరపున ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు పాల్గొన్నారు. నవంబర్ 3న జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వెస్ట్ విప్పర్రు గ్రామంలో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటిస్తూ వైఎస్సార్సీపీ మద్దతుదారులైన జడ్పీటీసీ అభ్యర్థి నల్లమిల్లి విజయ్ ఆనంద్ రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి చినిమిల్లి వెంకయ్యలకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక ప్రజలను అభ్యర్థించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనను చూసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# రవిబాబు హారర్ సినిమాలో కంగనా రనౌత్

వైవిధ్యమైన కథలు, విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు రవిబాబు మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'రేజర్'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన.. ఇప్పుడు హారర్ కథాంశంతో సినిమా తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించబోతున్నారనే వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముందస్తు పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా జరుగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కంగనా నిజంగానే ఈ సినిమాలో నటిస్తున్నారా? ఒకవేళ నటిస్తే ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.కంగనా రనౌత్ వంటి బాలీవుడ్ స్టార్.. రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమాలో నటించబోతున్నారనే ప్రచారం నిజమైతే ఈ ప్రాజెక్టుపై అంచనాలు పెరిగే అవకాశం ఉంది. కంగనా రనౌత్ గతంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'ఏక్ నిరంజన్' సినిమాలో హీరోయిన్‌గా కనిపించారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అదే ఆమె నటించిన ఏకైక తెలుగు చిత్రంగా ఇప్పటివరకు గుర్తింపు పొందింది. ఇప్పుడు రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమా చేస్తున్నారనే ప్రచారం నిజమైతే.. దాదాపు 17 ఏళ్ల తర్వాత ఆమె మరోసారి తెలుగు సినిమాలో కనిపించే అవకాశం ఉంటుంది. దీంతో ఈ వార్తపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.మరోవైపు కంగనా రనౌత్ ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'క్వీన్ 2', 'సర్కిల్', 'తను వెడ్స్ మను 3' వంటి ప్రాజెక్టులకు సంబంధించి వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తెలుగు సినిమా చేయబోతున్నారనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ సినిమాలో కంగనా నటిస్తున్నారా? చిత్రీకరణ నిజంగానే ప్రారంభమైందా? అనే అంశాలపై ఆమె బృందం లేదా చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలను ప్రచారంగానే పరిగణించాలి.

# ప్రభాస్ 'ఫౌజీ'కి చిక్కులు.. నేతాజీ చరిత్రను వక్రీకరించారంటూ దర్శకుడిపై విమర్శలు!



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఫౌజీ' చుట్టూ వివాదం మొదలైనట్లు వార్తలు వస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చరిత్రకు సంబంధించిన అంశాలను సినిమాలో వక్రీకరించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ విషయంపై నేతాజీ మనవడు, ఆయన కుటుంబానికి చెందిన చంద్రకుమార్ బోస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. చరిత్రను తప్పుగా చూపించినందుకు చిత్ర దర్శకుడు భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితానికి సంబంధించిన అంశాలను చిత్రాల్లో చూపించే విషయంలో దర్శకులు జాగ్రత్తగా వ్యవహరించాలని చంద్రకుమార్ బోస్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నేతాజీ, జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్‌తో సమావేశమైన సందర్భాన్ని సినిమాలో తప్పుగా చిత్రీకరించారనే ఆరోపణలు ఆయన చేశారు. స్వాతంత్ర్య పోరాటం, దానికి నాయకత్వం వహించిన ప్రముఖుల గురించి సినిమాలు తీయడానికి చిత్రనిర్మాతలకు స్వేచ్ఛ ఉంది కాని, సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో చారిత్రక వాస్తవాలను వక్రీకరించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ నాయకుల గురించి సినిమాలు తీసేటప్పుడు వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రకుమార్ బోస్ వ్యాఖ్యానించారు. చారిత్రక అంశాలను తప్పుగా చూపిస్తూ కల్పిత కథనాలను జోడించడం నేరంతో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు. నేతాజీ హిట్లర్‌తో జరిపిన భేటీకి సంబంధించిన అంశాలను వక్రీకరించడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుడి స్థాయిని తగ్గించినట్లుగా సినిమా ఉందని ఆయన ఆరోపించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 'ఫౌజీ' దర్శకుడు భారత ప్రజలకు, దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని గౌరవించే వారందరికీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ'పై వచ్చిన ఈ ఆరోపణలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే చంద్రకుమార్ బోస్ చేసిన ఆరోపణలకు సంబంధించి చిత్రబృందం అధికారికంగా స్పందిస్తుందా, సినిమాలో నేతాజీకి సంబంధించిన సన్నివేశాలను ఏ విధంగా చిత్రీకరించారు? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వివాదానికి సంబంధించి ఆరోపణలు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. చిత్రబృందం వివరణ లేదా సినిమాలోని సంబంధిత సన్నివేశాలపై పూర్తి సమాచారం అందుబాటులోకి వచ్చిన తర్వాతే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వరుస పాన్ ఇండియా సినిమాలతో గోపీచంద్ కమ్‌బ్యాక్..




టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ వరుస పరాజయాల నుంచి బయటపడి సాలిడ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. గతంలో తనకు విజయాలు అందించిన తరహా కథలకే పరిమితం కాకుండా, కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సినిమాలతోనైనా బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని గోపీచంద్ ప్రయత్నిస్తున్నారు. గోపీచంద్ నటిస్తున్న చిత్రాల్లో 'భరతవర్ష' ఒకటి. సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించింది. ఇటీవల విడుదల చేసిన 'అమ్మ కదిలి వచ్చే' పాటతో సినిమా సంగీత ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాపై గోపీచంద్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గత చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఆయన కెరీర్‌కు ఎలాంటి మలుపు తీసుకొస్తుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు గోపీచంద్ 'సింగా' అనే పాన్ ఇండియా చిత్రంలోనూ నటిస్తున్నారు. ఈ సినిమాతో స్టంట్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే సగానికిపైగా పూర్తయినట్లు తెలుస్తోంది.ఈ సినిమాకు సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్ గోపీచంద్ పాత్రపై ఆసక్తిని పెంచింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో మరో కీలక ప్రాజెక్టుగా నిలవనుంది. ప్రస్తుతం 'భరతవర్ష', 'సింగా' చిత్రాలతో బిజీగా ఉన్న గోపీచంద్.. విడుదల తేదీల విషయంలో మాత్రం తొందరపడటం లేదని తెలుస్తోంది. ఒక సినిమా షూటింగ్ పూర్తవగా, మరో సినిమా సగానికిపైగా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ రెండు సినిమాల విడుదల తేదీలను ప్రకటించలేదు. చిత్రీకరణ, నిర్మాణానంతర పనులు, ఇతర ఏర్పాట్లు పూర్తిగా సిద్ధమైన తర్వాతే విడుదల తేదీని ప్రకటించాలని చిత్ర బృందాలు భావిస్తున్నట్లు సమాచారం. ముందుగానే తేదీ ప్రకటించి, చివరి నిమిషంలో వాయిదా వేయాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. గోపీచంద్ గత కొంతకాలంగా ఆశించిన విజయాలను అందుకోలేకపోతున్నారు. దీంతో ఈసారి కథల ఎంపికలో కొత్తదనానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది.

# జైలర్ 2 బాక్సాఫీస్ సునామీ..

సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారని ట్రేడ్ వర్గాల గణాంకాలు చెబుతున్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన మొదటి వారంలోనే మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించినట్లు సమాచారం. ట్రేడ్ అంచనాల ప్రకారం, కేవలం 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. దీంతో రజనీకాంత్ అభిమానుల్లో ఈ సినిమాపై ఉత్సాహం మరింత పెరిగింది. సాధారణంగా భారీ అంచనాలతో విడుదలైన సినిమాలకు తొలి వారాంతంలో మంచి వసూళ్లు వచ్చినప్పటికీ, ఆ తర్వాత కలెక్షన్లు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. అయితే 'జైలర్ 2' విషయంలో రెండో వారాంతంలోనూ వసూళ్ల జోరు కొనసాగినట్లు ట్రేడ్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా రెండో ఆదివారం సినిమా కలెక్షన్లు పెరిగినట్లు సమాచారం. ఆ ఒక్క రోజే దేశవ్యాప్తంగా సుమారు రూ.25.70 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ గణాంకాలు పేర్కొంటున్నాయి. రెండో వారాంతంలోని మూడు రోజుల్లో కలిపి దాదాపు రూ.64.35 కోట్ల నెట్ వసూళ్లు వచ్చినట్లు అంచనా. ట్రేడ్ వర్గాల గణాంకాల ప్రకారం, 'జైలర్ 2' ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు రూ.710.35 కోట్లకు చేరినట్లు సమాచారం. ఇందులో దేశీయ మార్కెట్ నుంచి సుమారు రూ.466.85 కోట్లు, విదేశీ మార్కెట్ల నుంచి దాదాపు రూ.243.50 కోట్ల గ్రాస్ వచ్చినట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా నికర వసూళ్లు సుమారు రూ.398.70 కోట్లకు చేరినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే రూ.400 కోట్ల నెట్ మార్కును కూడా అందుకునే అవకాశం ఉంది. అయితే ఇవి ట్రేడ్ అంచనాల ఆధారంగా వచ్చిన గణాంకాలు కావడంతో, అధికారిక వసూళ్ల వివరాలతో పోల్చి చూడాల్సి ఉంటుంది.

